News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :77 | ఖమ్మం | శనివారం, మే 2, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



## అలర్ట్..నేడు ఫోన్లలో బీప్ సౌండ్ వస్తే కంగారు పడకండి..

- ఉదయం 11:15 నుంచి 12:15 గంటల మధ్య మొబైల్స్‌కు పరీక్షా సందేశాలు
- జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో ఈ ట్రయల్ రన్
- ఇది కేవలం పరీక్షేనని, ప్రజలు ఆందోళన చెందవద్దని అధికారుల సూచన
- విపత్తుల సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడమే ఈ వ్యవస్థ లక్ష్యం

మీ మొబైల్ ఫోన్ ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మోగుతూ, స్క్రీన్‌పై జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ( నుండి ఏదైనా సందేశం కనిపిస్తే అస్సలు కంగారు పడకండి. అది ఎటువంటి ప్రమాద హెచ్చరిక కాదు,

- మిగతా 2లో

## ఆర్టీసీ కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త



- ఆర్టీసీ కార్మికుల సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం
- మూడు రోజుల సమ్మె కాలాన్ని రెగ్యులర్ డ్యూటీగా పరిగణిస్తామని వెల్లడి
- కార్మికులపై పెట్టిన పోలీసు కేసులను కూడా ఎత్తివేయాలని ఆదేశం
- వెంటనే చర్యలు తీసుకోవాలని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సీఎం సూచన
- వెయ్యి కొత్త ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయనున్నట్లు ప్రకటన

- మిగతా 2లో

## ఎమ్మెల్యేల కంటే ప్రజలే ముఖ్యం..

### 22 నెలల్లో రూ.63 వేల కోట్లు పెన్షన్లకు ఖర్చు చేశాం

- మేడే సందర్భంగా పమిడిముక్కలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- కార్మికుల కోసం రాష్ట్రంలో 15 చోట్ల వసతులతో కూడిన లేబర్ అడ్డాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన
- గత 22 నెలల్లోనే పింఛన్ల కోసం రూ.63 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని వెల్లడి
- పునరుద్ధరించిన కార్మిక సంక్షేమ పథకాలు, కొత్త ఈఎస్ఐ ఆసుపత్రుల నిర్మాణంపై హామీ
- ప్రజలతోనే తన నిబద్ధత అని, ఎమ్మెల్యేల పనితీరును సమీక్షిస్తానని స్పష్టీకరణ



అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా సీఎం చంద్రబాబు కార్మికులకు అండగా నిలుస్తూ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 15 ముఖ్య ప్రాంతాల్లో కార్మికుల కోసం ప్రత్యేకంగా 'లేబర్ అడ్డాలు' ఏర్పాటు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. నేడు కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గంలోని పమిడిముక్కలలో జరిగిన 'పేదల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ కార్మికులు, పరిశ్రమల యాజమాన్యాలకు 'శ్రమ శక్తి' పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ...

- మిగతా 2లో



## పోలీస్‌శాఖలో అవినీతిని ఉపేక్షించం

- త్వరలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో
- 5 వేల ఖాళీల భర్తీకి ప్రభుత్వం సుముఖం
- డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో సీవీ ఆనంద్

పోలీస్‌శాఖలో అవినీతి అతిపెద్ద సమస్యగా మారిందని.. దాన్ని ఉపేక్షించబోమని నూతన డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. తాను ఏసీబీలో పనిచేసినప్పుడు పోలీసుల్లో అవినీతిని గమనించానన్నారు. ఈ సమస్యపై త్వరలోనే సమీక్షించి అలాంటి అధికారులను

- మిగతా 2లో

## డిజిటల్ సాంకేతికతతో సత్వర న్యాయం: సీజేఐ



గ్యాంగ్‌టక్: న్యాయ సాధన ప్రక్రియలకు సాంకేతికతను జోడించడం వల్ల భౌగోళిక దూరాభారాలు, న్యాయం కోసం అధికంగా డబ్బు వెచ్చించాల్సిన అగత్యం తొలగిపోతాయని, సత్వరం న్యాయం సిద్ధిస్తుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ శుక్రవారం తెలిపారు. 'సాంకేతికత - న్యాయ విద్య'పై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభ సమావేశంలో సీజేఐ ప్రసంగించారు. కేసుల కాగితపు రికార్డులు కోర్టుల స్టోర్‌రూమ్‌లలో మగ్గిపోయే దశ నుంచి శక్తిమంతమైన డిజిటల్ వ్యవస్థకు మారుతున్నామని వివరించారు. ఒకప్పుడు కోర్టుకు వెళ్లడమంటే సహనానికి

- మిగతా 2లో

## అక్రమార్కులపై పదునెక్కిన ఈడీ కొరడా

ప్రధాని మోదీ జమానాలో దర్యాప్తు సంస్థ పరుగులు
జప్తులు, అరెస్టులు, కేసుల నమోదులో భారీ పెరుగుదల

- మిగతా 2లో



## జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ రికార్డు...

ఏప్రిల్ లో కమర్షియల్ ట్యాక్స్ రాబడి రూ.7వేల 570 కోట్లు..
ఒక్క జీఎస్టీ నుంచే రూ.4వేల 621 కోట్లు..



గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే 35 శాతం అదనం
దేశవ్యాప్తంగా భారీగా పెరిగిన జీఎస్టీ వసూళ్లు

కమర్షియల్‌టాక్స్ రూపంలో రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయం వచ్చి చేరుతోంది. నిరుటితో పోలిస్తే ఈసారి ఏప్రిల్ లో వాణిజ్య పన్నుల శాఖ రికార్డు స్థాయి వసూళ్లు సాధించింది. జీఎస్టీతోపాటు పెట్రోల్, లిక్కర్‌పై వచ్చే వ్యాట్, వృత్తి పన్ను కలిపి రూ. 7,570 కోట్లు సమకూరాయి. గతేడాది ఏప్రిల్? కన్నా ఇది 22శాతం అదనం. ఇందులో జీఎస్టీ ఆదాయమే రూ. 4,621 కోట్లు ఉండడం విశేషం. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఒక నెలలో ఇవే అత్యధిక వసూళ్లు కావడం విశేషం.

- మిగతా 2లో




## పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయా?

### కొట్టిపారేయలేమన్న ప్రభుత్వ వర్గాలు

ఢిల్లీ: సమీప భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును కొట్టిపారేయలేమని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు ధరలు భారీగా పెరిగినప్పటికీ, నాలుగేళ్లుగా రిటైల్ ధరలు సవరించకపోవడం వల్ల నష్టాలు పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశాన్ని తోసిపుచ్చలేమని పేర్కొన్నాయి. హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకల రాకపోకలపై ఆంక్షలు, అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు కొలిక్కి రాకపోవడంతో

- మిగతా 2లో

# రెండు భారీ బస్ టెర్మినళ్లు

- శంషాబాద్‌లో 150 ఎకరాల్లో.. గాజులరామారంలో 100 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తాం
- గుర్తింపు ఎన్నికలు...విలీనంపై సమగ్ర కార్యాచరణతో రండి
- సంస్థ సమస్యలు 100% పరిష్కరిస్తాం.. ఒక్క డ్రైవర్‌నూ తొలగించం
- ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి
- సమ్మె కాలానికి వేతనం ఇస్తామని వెల్లడి
- కేసులు ఎత్తివేసేందుకు ఆదేశాలు







రాష్ట్రంలో ఆర్టీసీని బలోపేతం చేయడంతోపాటు, కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం 100 శాతం పరిష్కరిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆర్టీసీ మనుగడ, గౌరవాన్ని పెంపొందించి ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు వీలుగా సమగ్ర కార్యాచరణతో ముందుకు రావాలని కార్మిక సంఘాల ప్రతినిధులకు సూచించారు. వేతన సవరణ అంశాన్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ కార్మికులు ఇటీవల చేసిన మూడ్రోజుల సమ్మె కాలానికి వేతనాలు చెల్లించడంతో పాటు, సమ్మె సమయంలో నమోదైన కేసులను ఎత్తివేయాలని అధికారుల్ని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం సాయంత్రం ఆర్టీసీలోని 14 కార్మిక సంఘాల నాయకులు జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. "ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంత ప్రయాణికుల సౌకర్యం కోసం అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో బస్ టెర్మినళ్లు నిర్మించడానికి ఆర్టీసీకి గాజులరామారంలో 100 ఎకరాలు కేటాయించాం. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని బహదూర్‌గూడలో 150 ఎకరాలు కేటాయిస్తాం.

- మిగతా 2లో

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం



ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ మేరకు అత్యంత చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ ప్రజాభవన్‌లో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులతో ఆయన సమావేశమై

- మిగతా 2లో



## రూ.993 పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర...

### రాహుల్ గాంధీ ఆగ్రహం

- మూడు నెలల కాలంలో 81 శాతం పెరిగిందన్న రాహుల్ గాంధీ
- ఈ ధర పెంపు ఎన్నికల బిల్లు అని చురక
- రూ.993 పెరగడమంటే ఒకరోజులో నమోదైన అత్యధిక పెరుగుదల అన్న రాహుల్ గాంధీ

- మిగతా 2లో

# రెండు భారీ బస్ టెర్మినళ్లు

- మొదటి పేజి తరువాయి

ఆర్టీసీని సమున్నత స్థానంలో నిలపాలనే లక్ష్యంతోనే ఈ రెండు టెర్మినళ్లు నిర్మించాలని నిర్ణయించాం. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల నుంచి డిమాండ్ లేకపోయినా మేమే స్వయంగా ఈ నిర్ణయం తీసుకున్నాం. కార్మికులు.. ఉద్యోగ భద్రతపై ఆందోళన చెందవద్దు. సంస్థలో ఒక్క డ్రైవర్‌ను కూడా తొలగించబోము. మహాలక్ష్మీ పథకం ద్వారా ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.8 వేల కోట్లు ఇచ్చింది. మా ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీలో బస్సుల సంఖ్యను పెంచాం. నియామకాలు చేపట్టాం. ఆదాయాన్ని ఎక్కువ చేశాం. ఆర్టీసీ సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. నెలానెలా రాష్ట్ర ప్రభుత్వం చేసే చెల్లింపులతో ఆర్టీసీ ఆదాయం పెరిగింది. పని భారం పెరిగినా క్షేత్ర స్థాయి సిబ్బంది సహనంతో పని చేస్తుండడంతో తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలిచింది.

**ఎన్నికలపై ఆప్షన్లు ఇవ్వాలి**

ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై ఎలా ముందుకు పోవాలనే అంశంపై సంఘాల నాయకులు సమావేశమై ప్రభుత్వానికి ఆప్షన్లు ఇవ్వాలి. ఒకవేళ కార్మిక సంఘాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే ఏ యూనియన్‌కు ఆ యూనియన్ తమ ఆప్షన్లు ఇవ్వాలి. అందులో కామన్‌గా ఉన్న వాటికి ఆమోదం తెలిపి.. భిన్నాభిప్రాయాలు ఉన్న వాటిపై చర్చిద్దాం. డీజిల్ ఖర్చు తగ్గించడానికే ఎలక్ట్రిక్ బస్సులను ప్రోత్సహిస్తున్నాం. బస్సులు నడిపేందుకు డీజిల్‌పైన ఆర్టీసీ ఏటా రూ.2,000 కోట్లు ఖర్చు చేస్తోంది. ఆదాయం పెరగాలంటే ఖర్చు తగ్గించుకోవాలి. 1,000 ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేసి మెట్రోతో అనుసంధానం చేస్తున్నాం. మినీ బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అందివ్వాలని అనుకుంటున్నాం. రాజకీయాల ప్రభావానికి లోనైతే సంస్థకు నష్టం జరుగుతుంది. ఆర్టీసీ అప్పులపైన ఉన్న వడ్డీ భారాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తున్నాం. సంస్థ బలోపేతానికి కార్మికులు సహకరించాలి.

**నేను వేరు..మీరు వేరు కాదు**

నేను వేరు, మీరు వేరు అన్న భావన నాకు ఎప్పుడూ లేదు. అందరం కలిస్తేనే ప్రభుత్వం. కార్మికులు, ఆర్టీసీ యాజమాన్యం మధ్య స్నేహ పూర్వక వాతావరణం ఉండాలి. మా ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల హక్కులను కాపాడుతుంది. సంస్థ ఆగిపోతే ఊపిరిపోయినట్లే. సంస్థకు నష్టం జరిగే పనులు చేయొద్దు' అని సీఎం రేవంత్‌రెడ్డి కార్మిక సంఘాల నాయకులకు ఉద్బోధించారు. సమావేశంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ ఠాకూర్, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు ఈదురు వెంకన్న (ఎంప్లాయీస్ యూనియన్), ఏఆర్ రెడ్డి, థామస్‌రెడ్డి (తెలంగాణ మజ్దూర్ యూనియన్), అశ్వత్థామరెడ్డి, శంకర్ (తెలంగాణ మజ్దూర్ యూనియన్ (ఆ)), వీరాంజనేయులు, వీఎస్.రావు (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్), ఎస్.బాబు, పి.కమల్‌రెడ్డి, ఎండీ మౌలానా (నేషనల్ మజ్దూర్ యూనియన్), ఎంకే బోస్, బి.యాదగిరి (కార్మిక పరిషత్), జి.అబ్రహం, మొగుళ్ల రాజిరెడ్డి (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్), రాజిరెడ్డి, బి.యాదయ్య (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఆ)), బి.మునిరాములు, కె.యాదయ్య (బహుజన కార్మిక యూనియన్), కె.సత్యనారాయణ, ఎండీ అక్బర్ అలీ (ఆర్టీసీ వర్కర్స్ యూనియన్), కె.మనోహర్‌రావు, ఈ.స్వామి కుమార్ (కార్మిక సంఘ్), పున్న హరికిషన్, గోవింద్ (సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్), డి.వి.కె.రావు, కె.హనుమంతు ముదిరాజ్ (తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్), దువ్వాసీ యాదయ్య, సుద్దాల సురేష్ (బహుజన్ వర్కర్స్ యూనియన్) తదితరులు పాల్గొన్నారు. కేసీఆర్ హయాంలో 2019లో ఆర్టీసీ ఉద్యోగులు, సంఘాల నాయకులపై నమోదైన కేసులనూ ఎత్తివేసేందుకు సీఎం అంగీకరించారని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న ఓ ప్రకటనలో తెలిపారు.

**బకాయిలు అప్పటి ప్రభుత్వ హయాం లోనివి**

'ఆర్టీసీలో ప్రస్తుతం ఉన్న బకాయిలు మా హయాంలో పెట్టినవి కావు. గత ప్రభుత్వ కాలం నాటివి. ఆ బకాయిల్ని చెల్లించేందుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తోంది. గత ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల నిధుల్ని వాడుకుంది. మా ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీ ఉద్యోగులకు 1,000 కోట్ల బకాయిలు విడుదల చేసింది' అని సీఎం తెలిపారు.

# అక్రమార్కులపై పదునెక్కిన ఈడీ కొరడా

ఊసరవెల్లిలా రంగులు మారుస్తోన్న ఆర్థిక నేరగాళ్లను కట్టడి చేయడంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా సైబర్ మోసాలపై నిఘానూ ఈ దర్యాప్తు సంస్థ తీవ్రతరం చేసింది. సంస్థ 70 వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం విడుదల చేసిన 2025-26 వార్షిక నివేదికలోని గణాంకాలు పలు ఆసక్తికరమైన విశేషాలను వెల్లడించింది. ప్రధాని మోదీ పాలనలో ఈడీ పనితీరులో చురుకుదనం, కరకుదనం విస్పష్టమవుతోంది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పాలనా కాలంతో పోలిస్తే మోదీ పాలనలోని మొదటి పదేళ్లలో ఎఫ్‌ఐఆర్ (ఈసీఐఆర్) నమోదులు, అరెస్టులు, జప్తులు, ఛార్జిషీట్ల దాఖలు, దోషులకు శిక్షలు గణనీయంగా పెరిగాయని తెలుస్తోంది.

గత యూపీఏ పాలన(2005-14)తో పోలిస్తే ప్రధాని మోదీ హయాం(2014-24)లో ఏడాదికి సగటున కేసుల నమోదు 144%, జప్తులు 494%, జప్తుచేసిన ఆస్తుల విలువ 1977%, అరెస్టులు 3,900%, ఛార్జిషీట్ల దాఖలు 1,366%, అనుబంధ ఛార్జిషీట్ల దాఖలు 1,800%, సోదాలు 7,900% పెరిగాయి.

నేర నిరూపణ జరిగి శిక్షలు పడిన వ్యక్తుల సంఖ్య, మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద జప్తు మొత్తం గత యూపీఏ పాలనలో జీరోకి పరిమితం కాగా, మోదీ హయాంలో అది గణనీయంగా పెరిగింది.

ఆర్థిక మోసాలకు గురైన బాధితులకు గతంలో పైసా కూడా తిరిగి చెల్లించలేదు. ప్రధాని మోదీ పాలనలో ఇప్పటి వరకూ రూ.63వేల కోట్లు చెల్లించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిర్దిష్ట గడువులోగా దర్యాప్తు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈడీ వెల్లడించింది. అన్ని కొలమానాల్లోనూ 2024-25, 2025-26లో గరిష్ఠ పనితీరును కనబరిచినట్లు పేర్కొంది. 2024-25తో పోలిస్తే 2025-26లో కేసుల నమోదు సంఖ్య 39% పెరిగింది.గత రెండేళ్లలో సగటున 900 కేసులు నమోదయ్యాయని, 2014-15 నుంచి 2023-24 మధ్య పదేళ్లతో పోలిస్తే ఈ సంఖ్య దాదాపు రెట్టింపు అని తెలిపింది.

ఇదే సమయంలో ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు సగటున 600 దాఖలు చేశామని, అంతముందు పదేళ్లలో యేటా సగటున దాఖలైన 130తో పోలిస్తే ఇది నాలుగురెట్లు అధికమని ఈడీ వెల్లడించింది.

ప్రస్తుతం కేసుల దర్యాప్తులో డేటా అనలిటిక్స్, అడ్వాన్స్‌డ్ సైబర్ ఫోరెన్సిక్ టూల్స్ ఉపయోగిస్తున్నట్లు ఈడీ వెల్లడించింది.సోదాలతో పాటు, వివిధ డేటాబేస్‌ల నుంచి వచ్చే ఆర్థిక నిఘా సమాచారాన్ని, కార్పొరేట్, వ్యక్తిగత ఆస్తుల రికార్డులను రియల్‌టైమ్‌లో విశ్లేషించడం వల్ల ఆధారాలు సంపాదించడం సులభమవుతోందని పేర్కొంది.

ఈడీ కేసుల్లో శిక్షల శాతం 94% దాకా ఉందని, ప్రస్తుతం ట్రయల్ కోర్టుల ముందు పెండింగ్‌లో ఉన్న 2,400 కేసుల్లో నిందితులందరికీ శిక్షపడుతుందని బలంగా విశ్వసిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ రాహుల్ నవీన్ పేర్కొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

- మొదటి పేజి తరువాయి

సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా వారి విన్నపాలను సావధానంగా విన్న ఆయన, సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ హామీలిచ్చారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఉద్యోగులు ఒక వారధిలా పని చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సామాన్యుల చెంతకు చేరుతున్నాయంటే, అందులో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని ప్రశంసించారు.

**ప్రభుత్వానికి సంఘాల ప్రతినిధుల ధన్యవాదాలు**

గతంతో పోలిస్తే ప్రస్తుతం ఆర్థిక క్రమశిక్షణతోపాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆయా సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు అందుతుండటంతో వేల కుటుంబాలకు ఊరట లభిస్తోందన్నారు. విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రతినెలా రూ.1,000 కోట్లు కేటాయిస్తున్నందుకు వారు డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీలో ఉద్యోగ సంఘాల నేతలు ప్రధానంగా... పెండింగులో ఉన్న పీఆర్సీ, కరవు భత్యం(డీఏ), హెల్త్ కార్డుల వంటి దీర్ఘకాలిక సమస్యలను భట్టి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి మాట్లాడుతూ... "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగుల సమస్యలపై సానుకూల దృక్పథంతో ఉన్నారు. సంఘాల ప్రతినిధులు చెప్పిన అంశాలన్నీ సీఎం దృష్టికి తీసుకెళతా.

మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో నూ సమగ్రంగా చర్చించి త్వరలోనే ఉద్యోగులకు చెబుతాం" అని భరోసా ఇచ్చారు. సమావేశంలో ఉద్యోగ సంఘాల ఐకాస నేతలు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, దేవరకొండ సైదులు, లచ్చిరెడ్డి సహా పలువురు ఉన్నతా ధికారులు, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయా?

-మొదటిపేజీ తరువాయి

అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఇటీవల బ్యారెల్ ధర 126 డాలర్లకు చేరుకుంది. నాలుగేళ్లలో ఇదే గరిష్ఠం. ఆ తర్వాత కొంత తగ్గి ప్రస్తుతం 110 డాలర్లపైనే కొనసాగుతోంది.

**ఇది ఎన్నికల బిల్లే.. ఇక పెట్రోల్ వంతు: రాహుల్**

వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరను భారీగా పెంచడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఇది 'ఎన్నికల బిల్లు' అంటూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. కేంద్రం తర్వాతి బాదుడు పెట్రోల్, డీజిల్‌పైనే అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "ఎన్నికల తర్వాత ద్రవ్యోల్బణ సెగ తగులుతుందని నేను ముందే చెప్పా. అన్నట్లుగానే వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను ఒకేసారి రూ.993 పెంచారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు వాణిజ్య సిలిండర్‌పై రూ.1380 పెంచారు. అంటే కేవలం మూడు నెలల్లోనే 81శాతం పెరిగింది. టీ స్టాల్, దాబా, హోటల్, బేకరీ, స్వీట్‌షాపులకు ఇక భారమే. ఈ ప్రభావం మీ ప్లేట్‌పైనా పడుతుంది. ఇప్పుడు గ్యాస్‌పై పెంచారు. తర్వాతి బాదుడు పెట్రోల్, డీజిల్‌పైనే" అని రాహుల్ గాంధీ కేంద్రంపై మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీని 'ఇన్‌ఫ్లేషన్ మ్యాన్ మోదీ' అంటూ కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. వాణిజ్య సిలిండర్ల ధరలను కేంద్రం తరచూ పెంచుతూ వ్యాపారాలను భారంగా మారుస్తోందని దుయ్యబట్టింది.

# పోలీస్‌శాఖలో అవినీతిని ఉపేక్షించం

- మొదటి పేజి తరువాయి

ప్రత్యేకంగా పిలిచి మాట్లాడబోతున్నానని చెప్పారు. డీజీపీ కార్యాలయంలో శుక్రవారం శాంతిభద్రతల డీజీపీ మహేశ్‌భగవత్ నుంచి బ్యాటన్ అందుకొన్న అనంతరం కుటుంబసభ్యుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీస్‌శాఖ.. అధికారపక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా చట్టాల మేరకే నడుచుకుంటుందన్నారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు శ్రుతిమించినప్పుడే పోలీసులు పిక్చర్‌లోకి వస్తారని స్పష్టం చేశారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేస్తామన్నారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో త్వరలోనే అనుబంధ అభియోగపత్రం దాఖలు చేస్తామని తెలిపారు. సమావేశంలో డీజీపీలు వి.వి.శ్రీనివాసరావు, స్వాతిలక్రా, సజ్జనర్, చారుసిన్హా, ఐజీపీలు ఎం.రమేశ్, షానవాజ్‌ఖాసిం, రమేశ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీవీఆనంద్ మాట్లాడారు.

**రాష్ట్రమంతటా ఏకరీతి పోలీసింగ్..**

'సైబర్ నేరాల సమస్యపై ఇప్పటికే సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనిచేస్తోంది. మ్యూల్‌ఖాతాలను పట్టుకోవడంతోపాటు పెద్దఎత్తున దర్యాప్తు చేస్తోంది. అయితే జిల్లాల్లో మాత్రం దర్యాప్తు కొరవడుతోంది. అందుకే జిల్లాల్లోనూ ఈ కేసుల్ని సులభంగా దర్యాప్తు చేసేందుకు ఏకరీతి పోలీసింగ్‌ను అమలు చేయబోతున్నాం. అలాగే మాదకద్రవ్యాల సమస్యను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటాం. మరోవైపు వ్యవస్థీకృత నేరంగా మారిన మానవ అక్రమరవాణా, ఆహారకల్తీ, జంతువుల స్మగ్లింగ్.. వంటి ముఠాలను గుర్తించి కఠినంగా వ్యవహరిస్తాం. రాజధానిలోని నాలుగు కమిషనరేట్ల పరిధిలో రోజుకు 1,600 కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. అందుకు అనుగుణంగా రహదారులను నిర్మించడం అంత సులువు కాదు కాబట్టి ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించడంలాంటి రోడ్‌ఇంజినీరింగ్‌పై దృష్టి సారిస్తాం. దేశవ్యాప్తంగా ఏటా 1.72లక్షల మంది మరణిస్తే.. తెలంగాణలో 7 వేల మంది చనిపోతున్నారు. రోడ్డుభద్రత కోసం ఇప్పటికే అరైవ్-అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. అయితే హైదరాబాద్‌లో హెల్మెట్ నిబంధన అమలు చేస్తే రాష్ట్రమంతటా చేయడం లేదు. అందుకే రాష్ట్రమంతా ట్రాఫిక్ నిబంధనల్ని ఏకరీతిలో అమలు చేయబోతున్నాం. రోడ్డుభద్రతకు రాష్ట్రస్థాయిలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటు చేస్తాం.

**పోలీస్‌శాఖ పునర్వ్యవస్థీకరణ అవసరం**

పోలీస్‌శాఖలో ఇప్పుడు 19వేల ఖాళీలున్నాయి. అయితే ఎప్పుడైనా పూర్తిస్థాయిలో రిక్రూట్‌మెంట్లు సాధ్యం కాదు. అందుకే పునర్వ్యవస్థీకరణ చేయబోతున్నాం. నక్సల్స్ సమస్య దాదాపుగా తీరిపోయిన నేపథ్యంలో అంతమంది సిబ్బందిని అక్కడ ఉంచడం సరికాదు. సిబ్బంది అవసరమైన విజిలెన్స్, ఏసీబీ, సీఐడీలాంటి విభాగాలకు సర్దుబాటు చేస్తాం. ప్రస్తుతం 5వేల ఖాళీల భర్తీకి ప్రభుత్వం సుముఖంగా ఉంది. పునర్వ్యవస్థీకరణ తర్వాత కచ్చితమైన ఖాళీల భర్తీకి ప్రభుత్వానికి నివేదిస్తాం. పోలీస్‌శాఖలో సత్సంప్రదాయాలు సన్నగిల్లుతున్నాయి. సమన్వయలోపాన్ని సరిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం' అని సీవీ ఆనంద్ చెప్పారు.

మీడియా అడిగిన ప్రశ్నలపై స్పందిస్తూ.. 2010లో మావోయిస్టుల సమస్యను అంతం చేస్తామని కేంద్రం చెప్పినప్పుడు తెలంగాణ పోలీసులుగా మేం నవ్వుకున్నామని పేర్కొన్నారు. కానీ ఇప్పుడు మావోయిస్టులు ఆయుధాలతోసహా లొంగిపోవడంతో నక్సలిజం పెరిగే అవకాశం చాలా తక్కువగా ఉందన్నారు. లొంగిపోయిన మావోయిస్టులపై తప్పనిసరిగా పోలీస్ పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 13లక్షల సీసీ కెమెరాల్లో ప్రస్తుతం 32శాతమే పనిచేస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో కొత్తవి ఏర్పాటు చేయకున్నా.. ఉన్నవాటి మరమ్మతులకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. గోవధకు సంబంధించి ఫిర్యాదుల నమోదుకు టోల్‌ఫ్రీనంబర్ ఏర్పాటు చేస్తామన్నారు.

## రూ.993 పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర.. రాహుల్ గాంధీ ఆగ్రహం .

వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఈ ధరల పెంపుపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. కేవలం మూడు నెలల్లోనే వాణిజ్య సిలిండర్ ధరను 81 శాతం పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాణిజ్య సిలిండర్ ధరను ఒక్కరోజులోనే రూ.993 పెంచారని, ఇది కచ్చితంగా ఎన్నికల బిల్లు అని ఎద్దేవా చేశారు. ఎన్నికల తర్వాత ధరలు పెరుగుతాయని తాను ముందే హెచ్చరించానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకు నిదర్శనమే నేడు వాణిజ్య సిలిండర్ ధర పెంపు అని తెలిపారు. రూ.993 పెరగడమంటే, ఇది ఒకరోజులో నమోదైన అతిపెద్ద పెరుగుదల అని ఆయన అన్నారు. ఫిబ్రవరి నెల నుంచి ఇప్పటి వరకు ధర రూ.1,380 పెరిగిందని ఆరోపించారు. అంటే గత మూడు నెలల కాలంలో 81 శాతం పెరుగుదల నమోదైనట్లు చెప్పారు.వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడం వల్ల ఈ ప్రభావం చిన్న చిన్న వ్యాపారులపై తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. టీ దుకాణాలు, చాయ్-టిఫిన్ డబ్బాలు, హోటళ్లు, బేకరీలు, మిఠాయి దుకాణాలు తదితర వాటిపై ప్రభావం పడుతుందని అన్నారు. తద్వారా ఇది సామాన్యులకు కూడా భారంగా మారుతుందని అన్నారు.నేటి ధరల పెంపుతో 19 కేజీల వాణిజ్య సిలిండర్ రూ.3 వేలకు పైగా ధర పలుకుతోంది.

# ఆర్టీసీ కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) ఉద్యోగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. ఇటీవల కార్మికులు చేపట్టిన మూడు రోజుల సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ కాలాన్ని రెగ్యులర్ డ్యూటీగా పరిగణించనున్నట్లు సీఎం స్పష్టం చేశారు. అదేవిధంగా, సమ్మె సమయంలో కార్మికులపై నమోదు చేసిన పోలీసు కేసులను కూడా ఉపసంహరించుకోవాలని ఆయన ఆదేశించారు.

హైదరాబాద్‌లోని తన నివాసంలో నిన్న టీజీఎస్‌ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నేతలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారు. సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని, కేసులు ఎత్తివేయాలని కార్మిక సంఘాల నేతలు చేసిన విజ్ఞప్తికి సీఎం సానుకూలంగా స్పందించారు. ఈ హామీల అమలుకు తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను, ఉన్నతాధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలను 100 శాతం పరిష్కరించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. సంస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా రూ.8,000 కోట్లు అందించిందని, ఉద్యోగుల బకాయిల కోసం రూ.1,000 కోట్లు విడుదల చేసిందని గుర్తుచేశారు.అలాగే, మెట్రో రైల్ నెట్‌వర్క్‌కు అనుసంధానంగా 1,000 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. శంషాబాద్ సమీపంలోని బహదూర్‌గూడలో 150 ఎకరాల్లో, గజులరామారంలో 100 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ సంఘాల నేతలు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## అలర్ట్..నేడు ఫోన్లలో బీప్ సౌండ్ వస్తే కంగారు పడకండి..

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం చేపట్టిన ఒక కీలకమైన పరీక్ష మాత్రమే. దేశవ్యాప్తంగా విపత్తుల సమయంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'సెల్ బ్రాడ్కాస్ట్ అలర్ట్' వ్యవస్థను పరీక్షిస్తోంది. సునామీలు, భూకంపాలు, పిడుగుపాట్లు లేదా గ్యాస్ లీకేజీల వంటి అత్యవసర సమయాల్లో లక్షలాది మంది ప్రజలకు క్షణాల్లో సమాచారాన్ని చేరవేయడం ఈ వ్యవస్థ ముఖ్య ఉద్దేశ్యం. దీని ద్వారా విపత్తు సంభవించే ముందే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లే అవకాశం కలుగుతుంది. ప్రభుత్వం స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన ఈ 'సెల్ బ్రాడ్కాస్ట్ సిస్టమ్' పనితీరును నిర్ధారించుకోవడానికి ఈ జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహిస్తోంది.

**అమిత్ షా చేతుల మీదుగా ప్రారంభం..**

కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో కలిసి ఈ మొబైల్ ఆధారిత విపత్తు కమ్యూనికేషన్ వ్యవస్థను అధికారికంగా ప్రారంభించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎటువంటి నెట్‌వర్క్ జాప్యం లేకుండా వేగంగా హెచ్చరికలను పంపడం ఈ సిస్టమ్ ప్రత్యేకత. కాబట్టి, మీ ఫోన్‌కు ఇటువంటి 'టెస్ట్ అలర్ట్' వచ్చినప్పుడు అది కేవలం వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నమని గుర్తించండి.

## డిజిటల్ సాంకేతికతతో సత్వర న్యాయం: సీజేఐ

-మొదటిపేజీ తరువాయి

పరీక్షగా ఉండేదని సీజేఐ గుర్తుచేశారు. "హిమాలయ పర్వతాలు ఎంత గంభీరంగా ఉంటాయో, అక్కడ ప్రయాణం కూడా అంత నెమ్మదిగా, అనిశ్చితంగా ఉంటుంది. ఒక దశాబ్దం క్రితం సిక్కిం కక్షిదారుడు న్యాయం కోసం కోర్టుకు వెళ్లాలంటే ఇరుకైన కొండదారుల్లో ప్రతికూల వాతావరణంలో రోజుల తరబడి ప్రయాణించవలసి వచ్చేది. డిజిటల్ సాంకేతికత ఈ అడ్డంకులను తొలగిస్తోంది" అని ఆయన అన్నారు. న్యాయస్థానాలలో ఈ-సేవా కేంద్రాల విస్తరణ కూడా జరగాలని సీజేఐ అన్నారు. ఈ కార్యక్రమంలో సీషెల్స్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రోనీ జేమ్స్ గోవిందన్, శ్రీలంక సుప్రీం కోర్టు న్యాయమూర్తి మహమ్మద్ ధిలీప్ నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ రికార్డు...

- మొదటి పేజి తరువాయి

గత ఏడాది ఏప్రిల్‌లో ఇది రూ.3,433 కోట్లుగా ఉంది. అంటే ఏడాది కాలంలోనే దాదాపు రూ.1,188 కోట్లు అదనంగా వచ్చినట్లయింది. ఇది సుమారు 35 శాతం వృద్ధిని సూచిస్తోంది. ఇక గడిచిన మార్చి నెలలో వచ్చిన రూ.4,231 కోట్ల రికార్డును ప్రస్తుత వసూళ్లు దాటేశాయి. వరుసగా 4 నెలల నుంచి జీఎస్టీ ఆదాయం రూ.4 వేల కోట్లకు పైగా వస్తోంది. కాగా, పన్నుల వృద్ధి రేటులో కర్నాటక తర్వాత అత్యధిక వృద్ధి సాధించిన రెండో రాష్ట్రంగా నిలిచింది. ప్రజల వినియోగం, కొనుగోలు శక్తి పెరగడం, పారిశ్రామిక, సేవా రంగాల్లో వచ్చిన పురోగతి వల్లే ఆదాయం కూడా అంచనాలను మించిందని కమర్షియల్? ట్యాక్స్? కమిషనర్? రఘునందన్‌రావు తెలిపారు. పన్నుల ఎగవేతను అరికట్టడం కూడా మరో కారణమని ఆయన వెల్లడించారు. రాష్ట్రం నుంచి వసూలైన జీఎస్టీలో కేంద్ర జీఎస్టీ రూ.2,092 కోట్లు ఉండగా, రాష్ట్ర జీఎస్టీ వాటా రూ.2,527 కోట్లు ఉంటుంది. ఐజీఎస్టీ రూపంలో మరో రూ.2,562 కోట్లు వసూలయ్యాయి. ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యాపార అనుకూల విధానాల వల్ల కొత్త పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. దీనివల్ల నిరుద్యోగులకు ఉపాధి పెరగడమే కాకుండా ప్రజల కొనుగోలు శక్తి కూడా పెరిగినట్లు ఎక్స్?పర్ట్స్? చెప్తున్నారు.

**దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లు సరికొత్త చరిత్ర**

2026 ఏప్రిల్ నెలలో స్థూల జీఎస్టీ రాబడి రూ. 2,42,702 కోట్లకు చేరి రికార్డు సృష్టించింది. గతేడాది ఇదే నెలలో నమోదైన రూ. 2.23 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 8.7 శాతం వృద్ధిని నమోదు చేయడం విశేషం. ఇందులో దేశీయ లావాదేవీల ద్వారా రూ. 1,85,122 కోట్లు సమకూరగా, దిగుమతుల ద్వారా వచ్చే ఆదాయం ఏకంగా 25.8 శాతం వృద్ధితో రూ. 57,580 కోట్లకు చేరింది. ఇక రిఫండ్‌ల ప్రక్రియ తర్వాత నికర జీఎస్టీ వసూళ్లు రూ. 2,10,909 కోట్లుగా నమోదయ్యాయి, ఇది గతేడాది కంటే 7.3 శాతం పెరుగుదల. ముఖ్యంగా ఐజీఎస్టీ రూపంలో రూ. 1,29,232 కోట్లు, ఎస్జీఎస్టీ ద్వారా రూ. 61,331 కోట్లు, సీజీఎస్టీ ద్వారా రూ. 52,140 కోట్లు ఖజానాకు వచ్చి చేరాయి. ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న సానుకూల పవనాలు, పెరిగిన వినియోగం ఈ భారీ వసూళ్లకు ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రాలవారీగా వసూళ్లను పరిశీలిస్తే మహారాష్ట్ర రికార్డు స్థాయిలో రూ. 22,929 కోట్ల సెటిల్‌మెంట్ ఆదాయంతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.

## వనపర్తి ఆర్టీసి కార్మికులకు ఎమ్మెల్యే గుడ్ న్యూస్



**సి కె న్యూస్ వనపర్తి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:**మేడే సందర్భంగా వనపర్తి ఆర్టీసి డిపోలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసి కార్మికులందరికీ త్వరలోనే ప్రభుత్వ ఉద్యోగ హోదా కల్పిస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను స్పీడప్ చేస్తాం. ప్రతి కార్మికుడికి సర్కార్ కొలువు గ్యారంటీ" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు పట్టించుకోని విలీన ప్రక్రియను తమ ప్రభుత్వం వేగవంతం చేస్తుందని తెలిపారు.

ఎమ్మెల్యే ప్రకటనతో డిపోలో కార్మికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

## ఘనంగా నర్సాయిగూడెం గ్రామంలో కార్మిక జోజప్ప పండుగ వేడుకలు.








**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మే 1.**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని నర్సయ్యగూడెం గ్రామంలో శుక్రవారం కార్మిక జోజప్ప పండుగను ప్రతి ఏటా మే 1న క్రైస్తవులు,ఘనంగా జరుపుకున్నారు.ఇది దైవకుమారుడైన యేసును పెంచిన తండ్రి, వృత్తిరీత్యా వడ్రంగి అయిన పునీత జోజప్పను కార్మికులకు పాలకుడిగా గౌరవిస్తూ,పని యొక్క పవిత్రతను, కార్మికుల హక్కులను స్మరించుకునే 1955లో పోప్ 12వ పయస్ మే 1వ తేదీన కార్మిక దినోత్సవంతో పాటు పునీత జోజప్ప పండుగను జరుపుకోవాలని ప్రకటించారు.ఆదర్శం జోజప్ప తన కష్టార్జితంతో కుటుంబాన్ని పోషించిన విధానాన్ని ఆదర్శంగా తీసుకుని, శ్రమకు గౌరవం ఇవ్వాలని ఈ పండుగ బోధిస్తుంది.వేడుకలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు,దివ్యపూజ బలి నిర్వహిస్తారు.కార్మికులందరికీ మేలు జరగాలని,వారికి మంచి వేతనాలు,రక్షణ లభించాలని ప్రార్థిస్తారు.ఈ రోజు అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) కూడా కావడంతో,కార్మికుల హక్కులు, పని పరిస్థితుల మెరుగుదలపై చర్చి, సంఘాలు దృష్టి సారిస్తాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పసల జ్యోతి విజయానంద్ చర్చి సంఘం అధ్యక్షులు కాట జోజప్ప ఉపాధ్యక్షులు పసల చిన్నయ్య కార్యదర్శి విన్సెంట్ సంఘ సభ్యులు గుడిగ సల్మోన్ ఫాదర్లు జోష్. బీసెఫ్, ప్రసాద్ క్రైస్తవ బంధువులు గ్రామ పెద్దలు ఇన్నయ్య కాట బాలరాజు ఆరోగ్యం జాన్లు,తదితరులు పాల్గొన్నారు

## కరుణాపురంలో మేడే గ్రామ పంచాయతీ సిబ్బందికి సన్మానం



**సి.కే న్యూస్ మే 1 శుక్రవారం హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:** కరుణాపురం గ్రామ పంచాయతీ పరిధిలో మేడే సందర్భంగా పంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాలకవర్గం తరపున సిబ్బందికి నిత్యావసర సరుకులు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్ మాట్లాడుతూ, పంచాయతీ సిబ్బంది గ్రామ పరిశుభ్రత, అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, కొనియాడారు. ఎండ, వాన తేడా లేకుండా ప్రజల సేవలో నిరంతరం కృషి చేస్తున్న వారి సేవలు అమూల్యమని పేర్కొన్నారు. మేడే రోజున కార్మికుల శ్రమను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆకారపు అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి పద్మ గారు, వార్డు సభ్యులు ఆకారపు అరుణ్, రాజారపు జ్యోతి పాల్గొన్నారు.

# కార్మిక చట్టాల పునర్దన కోసం మే డే స్ఫూర్తితో పోరాటాలు.......!



- మోదీ హయాంలో కొనసాగుతున్న కార్మిక నిర్బంధకాలం.......
- సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్.....
- మతం పేరుతో కార్మికులను విభజించి హక్కులను కాజేస్తున్న మోదీ......!
- సిఐటియు సీనియర్ నాయకులు ఎంబీ నర్సారెడ్డి.
- సిఐటియు, సిపిఐ ఎం ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / భద్రాచలం ప్రతినిధి మే 01,**కేంద్రంలో ఎన్డీఏ అధికారం చేపట్టాక కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కోడ్లను తీసుకువచ్చి కార్మికుల హక్కులను మోదీ కాలరాశారని సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ ఆరోపించారు. మే డే స్ఫూర్తితో కార్మిక చట్టాల పునర్దన కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏ జె రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం 140 వ మే డే ఉత్సవాలను పట్టణ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక చందర్రావు భవనంలో సిఐటియు భద్రాచలం పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు అధ్యక్షతన జరిగిన కార్మిక సదస్సులో ఏజే రమేష్ పాల్గొని మాట్లాడారు. మేడే 140 సంవత్సరాల చరిత్రలో ఇంత నిర్బంధం ఎప్పుడు ఎవరు చూసి ఉండరని అన్నారు. చట్టాల స్థానంలో కోడ్లను తీసుకువచ్చి కార్మికులు స్వేచ్ఛగా కార్మిక దినోత్సవం కూడా చేసుకోకుండా మోడీ నిరంకుశంగా అడ్డుపడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అడుగుజాడల్లోనే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పయనిస్తూ ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దుచేసి కార్మికులతో 12 గంటల ఎట్టి చాకిరి చేపిస్తున్నారని అన్నారు. చికాగో నగరంలో ఎనిమిది గంటల పని కోసం కార్మికులు తమ ప్రాణాలను అర్పించి సాధించుకున్నారని వారి స్ఫూర్తితోనే మేడే ఆనాడు ప్రారంభమైందని గుర్తు చేశారు. మరోసారి మే డే స్ఫూర్తితో నిరంకుశ మోడీ సర్కార్ కి వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మతం పేరుతో కార్మికులను విభజించి హక్కులను కాజేస్తున్న మోదీ

సిఐటియు సీనియర్ నాయకులు ఏం బి నర్సారెడ్డి

కార్మికులు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలు నిర్వహించకుండా మతం మత్తు జల్లి కార్మికులను మతం పేరుతో విభజించి కార్మికుల హక్కులను మోది కాజేస్తున్నారని నర్సారెడ్డి ధ్వజమెత్తారు. కార్పొరేట్ శక్తుల కోసమే ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దుచేసి 12 గంటల పని నీ తీసుకువచ్చారని ఆరోపించారు. కార్మిక సమస్యలపై ప్రశ్నించేందుకు యూనియన్ లేకుండా చేసి శ్రమ దోపిడీకి మోడీ పాల్పడుతున్నారని అన్నారు. మోడీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వత్తాసుపలకటం దుర్మార్గమని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం మోడీ తీసుకు వచ్చిన కోడ్లను అత్యంత వేగంగా అమలు చేస్తున్నారని అన్నారు. హక్కులను కోల్పోతే కార్మిక తిరుగుబాటు తప్పదని ఆ తిరుగుబాటులో మోడీతో పాటు ఆయనకు భజన పలుకుతున్న అన్ని బూర్జవ పార్టీలు కార్మిక ఆగ్రహానికి గురి అవ్వటం ఖాయమని నర్సారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గడ్డం స్వామి కొలగాని రమేష్ నకిరేకంటి నాగరాజు పారెల్లి సంతోష్ కుమార్ డి రామకృష్ణ లక్ష్మణ్ చంద్ర లీల శివకుమారి తదితరులు పాల్గొన్నారు. మే డే సందర్భంగా పట్టణంలోని అన్ని కార్మిక కూడళ్ల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో జండా ఆవిష్కరణలను నిర్వహించారు ఆటో కార్మికులు పళ్ళ వర్తక సంఘం నాయకులు షాప్ ఎంప్లాయిస్ చిన్నపాటి లారీ ట్రాన్స్పోర్ట్ కార్మికులు ఇండస్ట్రియల్ కార్మికులు ముఠా సంగాల కార్యకర్తలు మేడే ర్యాలీలో భారీగా పాల్గొన్నారు.

సిపిఐఎం ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు.......!

సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ వ్యాప్తంగా మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుండే రాజుపేట లో జెండా ఆవిష్కరణ జరగగా అనంతరం ఎంపీ కాలనీ అశోక్ నగర్ కాలనీ కొత్త కాలనీ అయ్యప్ప కాలనీ భూపతి రావు కాలనీ ముదిరాజ్ వీధి రామాలయం సెంటర్ సుభాష్ నగర్ తదితర ప్రాంతాలలో సిపిఐ ఎం జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ అన్ని కార్మిక వాడలలో మేడే ఉత్సవాలను సిపిఎం ఘనంగా నిర్వహిస్తుందని అన్నారు. కార్మికుల హక్కుల కోసం జరిగే పోరాటాలలో ప్రజలు సైతం పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్మికులు బాగుంటేనే దేశం బాగుంటుందని కార్మికుల శ్రమతోనే దేశ పునాదులు నిర్మించబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి సీతాలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి కుంజా శ్రీను ఉస్తెల జ్యోతి జీవనజ్యోతి ధనకొండ రాఘవయ్య చుక్క మాధవరావు ఎస్ అజయ్ కుమార్ చాట్ల శ్రీనివాసరావు భూపేంద్ర అంబోజీరత్నం కనక శ్రీ శాఖ కార్యదర్శిలు గోవర్ధన ఝాన్సీ ఎర్రంశెట్టి పూర్ణిమ వేణు ధనమ్మ సీత సున్నం ప్రవీణ్ డివైఎఫ్ఐ నాయకులు సతీష్ బాబు ఎస్ఎఫ్ఐ నాయకులు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఉజ్వల భవిష్యత్తుకు 'బాల భరోసా' ఒక వరం.



- జిల్లా కలెక్టర్ అంకిత్
- మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఘనంగా "బాల భరోస"కార్యక్రమం.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 01,**స్థానిక జిల్లా కేంద్రంలోని రామవరంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం లో జిల్లా సంక్షేమ అధికారిణి జె. స్వర్ణలత లేనినా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి "బాల భరోస" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా, వారి ఎదుగుదలలో తలెత్తే లోపాలను తొలి దశలోనే గుర్తించి నివారించేందుకు 99 రోజుల ప్రజా ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'బాల భరోసా' కార్యక్రమం జిల్లా మహిళా శిశు సంక్షేమం మరియు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గతవారం రోజులుగా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా ముఖ్యంగా సున్నా నుండి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని, పిల్లల్లో ఉండే,న్యూరో డెవలప్మెంట్ (నాడీ వ్యవస్థ సంబంధిత) సమస్యలు,శారీరక ఎదుగుదల లోపాలు, మానసిక వికాసంలో ఆలస్యంవంటి అంశాలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా వారికి మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని, దానికి అనుగుణంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయం తో పనిచేసి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి భాగస్వామ్యం కావాలన్నారు . "బాల భరోస" కార్యక్రమం ముఖ్య ఉద్దేశం సకాలంలో జోక్యం అని పిల్లలలో ఏవైనా లోపాలు ఉన్నట్లు గుర్తిస్తే, వెంటనే వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స ప్రారంభించి, ఆ సమస్య తీవ్రతరం కాకుండా చూడాలన్నారు. ప్రతి చిన్నారి శారీరక మరియు మానసిక స్థితిని నిశితంగా పరిశీలించి, అవసరమైన వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించడం. చిన్నారులు ఆరోగ్యంగా, సంతోషంగా పెరిగేలా చూడటమే కాకుండా, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నారు. అదేవిధంగా జిల్లా సంక్షేమ అధికారిణి జె. స్వర్ణలత లేనినా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 2061 కేంద్రాలలో నమోదైన సున్నా నుండి ఐదు సంవత్సరాలలోపు అంగన్వాడి కేంద్రాలలో నమోదైన పిల్లలను ఆర్బిఎస్కే టీముల ద్వారా ముందస్తు అనారోగ్య గుర్తింపులో భాగంగా న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం ద్వారా జిల్లాలో ఉన్న 60,000 మంది చిన్నారులను 42 ప్రశ్నల ద్వారా ఆన్లైన్ పోర్టల్లో వివరాలను నమోదు చేయడం జరిగిందని, దానికి అనుగుణంగా పిల్లల అభివృద్ధిలో వెనకడుగు, న్యూరో డెవలప్మెంట్ మరియు శారీరక లోపాలు ఉన్న పిల్లలను గుర్తించి శుక్రవారం జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక పర్యవేక్షణ తో కూడిన పరీక్షలు నిర్వహించడం జరిగిందని, ఈ ఒక్క అవకాశాన్ని సద్వినియోగం ఈరోజు మాత్రమే చేసుకోకుండా సూచించిన తేదీలలో క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలని, అంగనవాడి టీచర్లను సకాలంలో జోక్యం చేసుకొని స్థానిక ప్రాథమిక వైద్య కేంద్రాలలో చికిత్స అందించి పిల్లల సంపూర్ణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు, ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ,సంతోషంగా , సురక్షితమైన భవిష్యత్తును నిర్మించే బాధ్యత మన అందరిపై ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ 0 నుండి 05 సంవత్సరాల పిల్లలు అందిస్తున్న సేవలను మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని సిబ్బందిని అడిగి తెలుసుకుని మెరుగైన సేవలు అందించాలని, మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని ప్రతి విభాగాన్ని పరిశీలించి సూచనలు జారీ చేయడం జరిగింది. తదుపరి "బేటి బచావో" కార్యక్రమంలో భాగంగా "భేటీ జన్మోత్సవ్"నిర్వహించి నెలలోపు జన్మించిన ఆడపిల్లలకు బేటి జన్మోత్సవ్ కిట్లను అందజేశారు.

ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది డాక్టర్ ప్రతాప్,డాక్టర్ వినోద్, నాగభూషణం, పీడియాట్రిషన్ డాక్టర్లు, జిల్లా స్థాయి ఆర్బిఎస్కే సిబ్బంది, నేషనల్ న్యూట్రిషన్ మిషన్ జిల్లా సమన్వయకర్త పి. సంపత్, సిడిపివోలు లక్ష్మీ ప్రసన్న, వెంకటరమణ, సూపర్వైజర్లు ,అంగనవాడి లిసిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## భద్రాచలం త్రివేణి పాఠశాలలో పదవ తరగతి పరీక్ష ఫలితాల ప్రభంజనం...

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 01,**త్రివేణి పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కే దర్శిని 579/600 మార్కులతో భద్రాచలం డివిజన్ టాప్ ప్లేస్ లో నిలిచింది. అదేవిధంగా పి. హర్షిణి ప్రియ 574/600, కే.మనోహర్ రెడ్డి 572/600 , జి పి ఎల్ అక్షయ 570/600 మరియు వై.సాయి సిరి 570/600 వంటి టాప్ మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. త్రివేణి పాఠశాలలో మొత్తం పదవ తరగతి విద్యార్థులు 82 మందికి గాను 51 మందికి పైగా 500 మార్కులతో విజయ డంకా మోగించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్. తెల్లం వెంకటరావు మొదటి విభాగంలో లో నిలిచిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు మాట్లాడుతూ భద్రాచలం పట్టణంలోని పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో టాప్ ప్లేస్ లో నిలిచిన త్రివేణి పాఠశాలకు, సహకరించిన తల్లి దండ్రులకు మరియు బోధనా సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ఇంత అత్యధిక శాతం మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులందరకి శుభాశీస్సులు అందించారు .త్రివేణి పాఠశాలలో ప్రతి సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాలలో వారి యొక్క సత్తా చాటుతున్నందుకు,ఈ ఘన విజయాని కి చక్కటి ప్రణాళికను రూపొందిస్తున్న యాజమాన్యాని కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిరుపమ,ఏవో బాబురావు, వైస్ ప్రిన్సిపాల్ విమల, అకాడమిక్ ఇన్చార్జి నరేష్ ,క్యాంపస్ ఇన్చార్జి సురేష్ , సందీప్ మరియు తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



## మేడే స్ఫూర్తితో నూతన పోరాటాలకు సిద్ధం కావాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా
- చికాగో వీరుల త్యాగఫలం కార్మిక వర్గానికి దిక్సూచి
- సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా 141వ మేడే..723 కేంద్రాల్లో ఎర్రజెండా రెపరెపలు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 01,** చికాగో వీరుల త్యాగఫలం ప్రపంచ కార్మిక వర్గానికి దిక్సూచి అని, నాడు ఎనిమిది గంటల పనిదినం కోసం ప్రాణాలర్పించిన వారి స్ఫూర్తితో హక్కుల రక్షణకు సమరశీల పోరాటాలు సాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం 141వ మేడే ఉత్సవాలు శుక్రవారం సిపిఐ, ఏఐటీయూసీ, అనుబంధ ప్రజా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ప్రధాన కూడళ్లు, హమాలీ అడ్డలు, ఆటో స్టాండ్‌లు, భవన నిర్మాణ కార్మిక క్షేత్రాలు, యూనియన్, పార్టీ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సాబీర్ పాషా ఎర్రజెండాను ఎగురవేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోస్టాఫీసు సెంటర్లో నిర్వహించిన భారీ ప్రదర్శన నిర్వహించారు. జెండావిష్కరణల అనంతరం జరిగిన సభల్లో సాబీర్ పాషా మాట్లాడుతూ కేంద్రంలోని పాలకులు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కార్మిక చట్టాలను నీరుగారుస్తున్నారని మండిపడ్డారు. దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా మార్చి కార్మికులను బానిసలుగా మారుస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం దేశ ప్రయోజనాలకు విఘాతమని, ఈ దుర్మార్గపు విధానాలపై కార్మికులు ఐక్యంగా పోరాడాలని కోరారు. మేడే స్ఫూర్తితో అన్యాయమైన విధానాలను ఎదిరించి, పని భద్రత, కనీస వేతనాల సాధన కోసం మరో పోరాట దశకు కార్మిక వర్గం సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా వ్యాపితంగా 723 కేంద్రాల్లో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించి చికాగో అమరవీరుల త్యాగాలు గుర్తుచేసుకున్నామని, కార్మికవర్గ పోరాటాలకు ఈ ఉత్సవాలు దోహద పడతాయన్నారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా నాయకులు దుర్గరాసి వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, గెద్దాడు నగేష్, ఎస్ కె ఫహీమ్, కె రత్నకుమారి, భూక్యా శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, రాంచందర్, పొలమూరి శ్రీనివాస్, భాగం మాధవరావు, యూసుఫ్, పిడుగు శ్రీనివాస్, ధనలక్ష్మి, కూరపాటి సుధాకర్, ధర్మరాజు, జహీర్, షాహీన్, మద్దాల హరిత, దాసరి శ్రీనివాస్, అస్మత్, ఏ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రామిక శక్తికి వందనం దేశ ప్రగతికి అభివందనం.

**అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎండి షర్ఫుద్దీన్ అధ్యక్షతన ప్రపంచ కార్మిక దినోత్సవ మే డే వేడుకలు.**




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 01,**కార్మిక,ఉపాధి,శిక్షణ కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు. అసోసియేషన్ హాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని క్లాత్ మర్చంట్ అండ్ వెల్ఫేర్ కార్మిక ,ఉపాధి,శిక్షణ కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్ ఐ ఎ యస్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రపంచ కార్మిక దినోత్సవం అయిన మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎండి షర్ఫుద్దీన్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను సాధించుకున్న మేడే రోజు కార్మికులు ఎంతో సంతోషంగా జరుపుకునే పండుగ ఇది అన్నారు. కార్మికులకు తెలంగాణ భవన ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా కల్పిస్తున్న పథకాలు విధివిధానాలను గురించి వివరించారు. ఐటిఐ ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతు కార్మిక శక్తిని పెంచాలని ఉద్దేశంతో సాంకేతిక నైపుణ్యంతో కలిగిన కార్మికులను తయారు చేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు నేటి యువతకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ఏ టి సి ఐ టి ఐలలో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరి నైపుణ్యమైన శిక్షణ పొంది మంచి ఉద్యోగ ఉపాధి అవకాశాలను పొందాలన్నారు. అదేవిధంగా కొత్తగూడెం ఏటీసీ కి చెందిన అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ డి హరీష్ కు ఉత్తమ సేవా అవార్డు అందించారు. కార్మికులు సైతం తమ హక్కులతో పాటు విధులను కూడా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రభుత్వ ఐటిఐ ఏ టి సి లకు చెందిన ప్రిన్సిపాల్ ఆయా కళాశాల అడ్మిషన్లకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సహాయ కార్మిక అధికారులు బి ఎన్ రాజు, పి వి కే శాస్త్రి, ఐటిఐ ప్రిన్సిపాల్ ధర్మచారి, రవి విద్య శాఖ నుండి పై శ్రీనివాస్ లతోపాటు వివిధ కార్మిక సంఘాల నాయలు నారటీ ప్రసాద్, బి పరమేశ్, లక్ష్మణ్ నాయక్, పొగుల కోటేశ్వర రావు, చందరరావు, నరసింహ రావు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మేడే ను ఘనంగా నిర్వహించుకున్న ఫిమాకం ఎంప్లాయిస్ యూనియన్.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,మే 01,**మేడే సందర్భంగా ఫిమాకం ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కడారు వెంకటేశ్వరరావు యూనియన్ జనరల్ సెక్రెటరీ పి వి వి ఎస్ ఎన్ వి ప్రసాద్ ఆధ్వర్యంలో మేడేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులకు టీ షర్టులను యూనియన్ గుర్తుగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి యూనియన్ సభ్యులు ఎం.వి చిరంజీవి రావు, కే నాగేశ్వరరావు, యాగయ్య తదితరులు పాల్గొని జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. అదేవిధంగా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ గద్దం వెంకటేశ్వర్లు, ప్రెసిడెంట్ పాండవుల ఉపేందర్, లక్ష్మీనారాయణ, చంద్రరావు, ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కడారు వెంకటేశ్వరరావు, ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ యూనియన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జండాలను ఆవిష్కరించారు.
ఈ కార్యక్రమానికి ఆహ్వానితులు నల జాల సత్యనారాయణ, ఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో సరుకులు పంపిణీ



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండల కేంద్రంలోని అంగన్వాడి సెంటర్లో మే నెల మొత్తం. వేసవి సెలవులు దృష్ట్యా గర్భిణీ, బాలింతలకు ప్రీస్కూల్ పిల్లలకు 6-3 పిల్లలకి టి హెచ్ ఆర్ పంపిణీ చేసారు. అనంతరం ఏఎల్ఎంసి కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసి కమిటీ సభ్యులకి సరుకులు పంపిణీ చేసే క్వాంటిటీ గురించి వివరించారు. ఎండాకాలంలో తీసుకునే జాగ్రత్తలు గురించి తల్లులకు వివరించారు.మరియు పిల్లలను బరువులు తీసి తల్లిదండ్రులకు పోషణ స్థాయి గురించి వివరించారు.గర్భిణీ బాలింతలకి ప్రీస్కూల్ పిల్లలకి సరుకులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో.. చింతకాని గ్రామ సర్పంచ్ కిలారు మనోహర్ బాబు, వార్డు సభ్యులు కిలారు బాబురావు,వేముల కొండలరావు (ఆకాష్ ),అంగన్వాడి టీచర్లు,ఆయాలు, తల్లిదండ్రులు,పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

## చింతకాని మండలంలో గ్రామ గ్రామాన ఘనంగా మేడే వేడుకలు

- **నాగలవంచ గ్రామంలో భారీ ర్యాలీ తీసిన సిపిఎం శ్రేణులు**
- **నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలి.. వత్సవాయి జానకి రాములు**

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండలంలోని సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో వాడ వాడల ఘనంగా మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా స్థానిక సిపిఎం కార్యాలయంలో సిపిఎం సీనియర్ నాయకులు వత్సవాయి జానకి రాములు, నాగులవంచ లో సిపిఎం సీనియర్ నాయకులు మునుకుంట్ల సుబ్బారావు జండా ఆవిష్కరించారు అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలను రద్దు చేయాలని ,కార్మిక కోడులను ప్రవేశపెట్టి కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దుచేసి, కార్మిక చట్టాలను అమలుపరచాలని అన్నారు.లేబర్ కోడ్ లను ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను హరించాలని చూస్తుంది, ఆనాడు ఎనిమిది గంటల పని విధానం కనీస వేతన చట్టాన్ని కార్మికులు సాధించుకున్న హక్కులను హరింప చేస్తున్నారు. నేడు ప్రవేశపెట్టిన లేబర్ కోడుల వలన కార్పొరేట్ వ్యవస్థలకు బడా కంపెనీలకు లాభం చేకూర్చే విధంగా కార్మికులు 10 గంటల నుండి 12 గంటల పని విధానాన్ని , కార్మిక వితర హక్కులను అన్నిటిని హరింప చేస్తున్నాయి. అందుకని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక చట్టాలను . నాలుగు లేబర్ కోడెలను రద్దుపరిచే వరకు కార్మికులందరూ ఐక్యంగా పోరాడి






పట్టించుకోవాలన్నారు కార్మిక హక్కులను దక్కించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దేశ బోయిన ఉపేందర్, సిపిఎం సీనియర్ నాయకులు గద్దం కోటేశ్వరావు, కొంపెల్లి శ్రీనివాసరావు, జాజాల నాగరాజు, మరికంటి రవి,నాగులవంచ సిపిఎం సీనియర్ నాయకులు మునుకుంట్ల సుబ్బారావు,రౌతు అప్పారావు, కందరబోయిన కొండలరావు, తోటకూరి వెంకనరసయ్య, ఆలస్యం రవి, బైరు రామయ్య, ఒని చిన్న మీరా, గంధం నాగార్జున లింగం సైదులు, గుమ్మడి నవీన్ అంబటి మధు. మొదలైన వారు మరియు కార్యకర్తలు సానుభూతి పరులు పాల్గొన్నారు

## వైభవంగా చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు.










**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మే ఒకటి.**మండల పరిధిలోని అరూరు గ్రామంలో వెలిసిన శ్రీ భూనీళా గోదా సమేత శ్రీ చెన్నకేశవ స్వామి వార్షిక అధ్యాయన బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి ఈ వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉ. 11 గంటలకు ధ్వజరోహం సా.8.30 ని.లకు శ్రీ భూనీళా సమేత చెన్నకేశవ స్వామి తిరు కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితులు కీ.శే. వేదాంతం శ్రీనివాసాచార్యులు వారి కుమారులు కీ.శే.వేదాంతం వెంకటాచార్యులు వారి సోదరులు శ్రీమాన్ వేదాంతం శేషాచార్యులు. రాజసింహచార్యులు.వేదాంతం కృష్ణమాచార్యులు బృందంచే మంత్రోచ్చారణలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు ఈ సందర్భంగా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు అనంతరం బిజెపి సీనియర్ నాయకులు దేవనక అనురాధ అంజయ్య దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు స్వామివారి కల్యాణానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక ఉప సర్పంచ్ సత్యనారాయణ యాదవ్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుక్క ముత్యాలు వార్డు మెంబర్లు గ్రామ చెందిన వివిధ పార్టీల నాయకులు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు

## అంబేద్కర్ భవనంలో గౌతమ బుద్ధుని జయంతి



**మే (01) సి కె న్యూస్ అబ్దుల్లా ఉస్మాన్ నారాయణఖేడ్ జిల్లా సంగారెడ్డి.** సందర్భంగా ఘనంగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బీఎస్పీ నారాయణఖేడ్ అధ్యక్షులు అనుముల తుకారం మాట్లాడుతూ, గౌతమ బుద్ధుని సందేశాలు, ఆలోచనలు ఈ ప్రపంచానికే మార్గదర్శకాలని తెలిపారు. సమత, శాంతి, అహింస అనే సిద్ధాంతాలతో బుద్ధుడు సమాజానికి దారి చూపారని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర రజక సంఘం కన్వీనర్ ప్రశాంత్ నాయకులు నారాయణ కాశయ్య సిద్ధూ , కార్యకర్తలు, బుద్ధ భక్తులు పాల్గొని బుద్ధుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

## సంగం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం ఐకెపి సెంటర్లు ప్రారంభం.



ప్రారంభించిన వారు భూక్య భీమా నాయక్.

**సీ కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మే ఒకటి.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో ఉన్న సంఘం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ఐకేపీ సెంటర్లు రెండు మార్కెట్ చైర్మన్ బీమా నాయక్ పాల్గొని ప్రారంభించినారు,మీడియా ద్వారా మాట్లాడుతూ రైతులు గిట్టుబాటు ధరకు మంచి సరియైన ధరకు ప్రభుత్వము నిర్ణయించిన ధరకు ఏ గ్రేడ్ రేటుకు అమ్ముకోవాలని దళారులను నమ్మి మోసపోవద్దని 48 గంటలలోనే రైతుల అకౌంట్లో డబ్బులు జమ అవుతాయని మార్కెట్లో ఏమన్నా సమస్యలు ఉంటే వెంటనే మాకు ఫిర్యాదు చేయవచ్చని మాట్లాడినారు,ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బాతరాజు ఉమా బాల నరసింహ పాశం సత్తిరెడ్డి బద్దం సంజీవరెడ్డి మరియు సంగం సర్పంచ్ తాడూరి లలిత లింగస్వామి వార్డు నెంబర్లు పాలకవర్గం మాజీ సర్పంచులు కీసరి రామిరెడ్డి కాసుల కృష్ణ గౌడ్ బిజెపి పార్టీ జిల్లా నాయకులు కందుల తానేష్ గౌడ్ వరికుప్పల మల్లేశం ఐకెపి సెంటర్ ఒకటి నిర్వాహకులు అధ్యక్షులు పూసుకోరి రేణుక కార్యదర్శి లింగయ్య కోశాధికారి శ్రీలత ఇన్చార్జి పాలెం ధనమ్మ వి బి కే పెంటయ్య ఐకెపి సెంటర్ 2 నిర్వహకులు అధ్యక్షులు భార్గవి కార్యదర్శి సరిత ఇంచార్జి గంగాపురం అన్నపూర్ణ కోశాధికారి నీరజ గంగపురం నరేష్ తదితరులు రైతులు అధిక సంఖ్యలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ కాలనీలో దొంగల బీభత్సం..

- **నగలు, డబ్బులు మాయం..**
- **కేసు నమోదు చేసిన పోలీసులు...**



**పెబ్బేరు మే01 (సి కే న్యూస్)**వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని జర్నలిస్ట్ కాలనీలో టీవీ5 రిపోర్టర్ విజయ్ ఇంట్లో కిరాయికి ఉంటున్న చింతకాయల నవీన్ యొక్క ఇంటి తాళం విరగొట్టి దొంగలు చొరబడి బంగారు, వెండి నగలు దొంగిలించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘటన జరిగింది.పెబ్బేరు ఎస్ఐ ఆధారాలు సేకరించి, దర్యాప్తు ముమ్మరం చేశారు.బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ తెలిపారు.

## నేడు 148 వ మేడే కార్మికుల దినోత్సవం.

**సందర్భంగా ఉపా ది హామీ కార్మికులతో కేక్ కట్ చేసి కార్మిక దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేయుట జరిగింది.**

**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మే ఒకటి.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం, 1886 నాటి చికాగో పోరాటంగా మాత్రమే భావిస్తారు కానీ భారతదేశంలో కార్మికులు అనుభవిస్తున్న ఎన్నో హక్కులు చట్టాలకు మూలపురుషుడు డాక్టర్ బి.ఆర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కార్మిక చట్టాల రూపశిల్పి కార్మిక హక్కుల యోధుడిగా ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా మనం తప్పక గుర్తుంచుకోవాలని వికాలాంగుల హెల్పింగ్ సొసైటీ అధ్యక్షుడు సింగారం రమేష్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు నేరటి పురుషోత్తం మాట్లాడుతూ 8 గంటల పని విధానాన్ని చట్టబద్ధం చేశారు కార్మికులకు న్యాయబద్ధమైన కనీస వేతనం దక్కేలా చట్టాన్ని తీసుకోవచ్చారు కార్మికులకు వైద్యపరమైన సామాజిక భద్రత కల్పించారు. ఉపా ది హామీ కూలీలకు పీస్ వాల్యూ ఫోటోలు రద్దు చేయాలని ఈ సందర్భంగా కోరారు. దీనివలన కొంతమంది కన్నులు ఫోటోలు రాక కూలీలకు ఇబ్బంది కలుగుతుందని తెలియజేశారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఇట్టి విషయాలను గుర్తించి ఈ విధానాన్ని రద్దు చేసి కూలికి వచ్చిన వారికి కూలి ఇవ్వాలని కోరారు ఈ కార్యక్రమంలో కొమ్మ గళ్ళ చంద్రయ్య, కొడాలి మాధవి ,గురుకు శ్వేత ,పంజాల వినోద, రజిని ,మమత, కావ్య ,భాగ్య, ఉపేంద్ర, లక్ష్మి ,యాదమ్మ మొదలగువారు పాల్గొన్నారు



## శ్రమ శక్తి అవార్డు అందుకున్న నల్ల స్వామి



**సీకే న్యూస్ మే 1 శుక్రవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:**ప్రతి ఏడాది మే డే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక "శ్రమ శక్తి అవార్డు" ఈసారి ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామానికి చెందిన నల్ల స్వామికి లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో కార్మిక శాఖా మంత్రి వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ఈ అవార్డు అందజేశారు.
నల్ల స్వామి మూడు దశాబ్దాలుగా తాపీ మేస్త్రిగా పనిచేస్తూ భవన నిర్మాణ రంగంలో తన అనుభవాన్ని చాటుకుంటున్నారు. అదే సమయంలో కార్మిక సంఘంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. కార్మికుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ముందుండే ఆయన సేవలను గుర్తిస్తూ ఈ అవార్డు అందించారు.

# మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

- గ్రామంలోని రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు
- మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి







**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**దిక్కుతోచని పరిస్థితిలో భిక్కు బిక్కు మంటున్న నాగులవంచ రైతులు(గ్రామ రైతులు
గత నెల రోజుల క్రితం ఖాటాలు పూర్తయి లారీలు రాక కల్లాల్లో లాట్లు వేసిన మొక్కజొన్న బస్తాలు మరియు ఖాటాలు పూర్తికానటువంటి రైతులు నిన్న సాయంత్రం వచ్చిన గాలి దుమారం వలన వర్షం పడి ఎక్కడ తమ మొక్కజొన్న పంట ఆగమైతుందో అని ఆవేదన చెందినటువంటి పరిస్థితి.
ఈ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి మరి తప్పుడు విధానాలను విడనాడి తక్షణమే చిన్నమండవ గ్రామ మొక్కజొన్న రైతుల సమస్యలు పరిష్కరించాలని చిన్నమండవ గ్రామం మొక్కజొన్న రైతులు కోరడం జరుగుతుందిలి
అధికార పార్టీ చేతిలో ఉంచుకొని మొక్కజొన్న రైతుల కష్టాలు అర్థం కావడం లేదాలి
అధికార పార్టీ ఉంటే మీరు ఎరైతులు చేసింది ఏమిటి ??
ఏ టైంలో ఎలా ఉంటుందో వర్షం ఎప్పుడు వస్తుంది కూడా అర్థం కాక రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు

## తిర్లాపురం గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో సరుకులు పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండల పరిధిలో తిర్లాపురం అంగన్వాడి వాడి కేంద్రం లో మే నెల మొత్తం. వేసవి సెలవులు దృష్ట్యా గర్భిణీ, బాలింతలకు ప్రీస్కూల్ పిల్లలకు 6-3 పిల్లలకి టి హెచ్ ఆర్ పంపిణీ చేసారు. అనంతరం ఏఎల్ఎంసి కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసి కమిటీ సభ్యులకి సరుకులు పంపిణీ చేసే క్వాంటిటీ గురించి వివరించారు. ఎండాకాలంలో తీసుకునే జాగ్రత్తలు గురించి తల్లులకు వివరించారు .మరియు పిల్లలను బరువులు తీసి తల్లిదండ్రులకు పోషణ స్థాయి గురించి వివరించారు.గర్భిణీ బాలింతలకి ప్రీస్కూల్ పిల్లలకి సరుకులు పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో.. తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు , గ్రామ సెక్రెటరీ ఉషారాణి, అంగన్వాడి టీచర్ నాగ సీతారత్నం, మరీదు భూపతి రావు, మడిపల్లి సైదులు, చాపలమడుగు నాగమ్మ, చాపలమడుగు సైదులు, చాపల మడుగు సుష్మ, గోగుల అంజమ్మ, గోగుల విజయమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ కంచం ద్రౌపతి కోటేశ్వరరావు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**మత్కేపల్లి గ్రామంలో ఎన్నో ఏళ్లుగా సొంతింటి కల కోసం ఎదురుచూసిన మొక్క రాములు -- భాగ్యమ్మ దంపతుల కల ఈరోజు నిజమైంది.
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అందించిన "ఇందిరమ్మ ఇల్లు" పూర్తయ్యి, ఆ దంపతులు ఆనందోత్సాహాల మధ్య గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు.
ఈ శుభ సందర్భానికి గ్రామ సర్పంచ్ కంచం ద్రౌపతి ముఖ్య అతిథిగా హాజరై, దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.
పేదింటి కలను సాకారం చేసి, ఎన్నో ఏళ్ల ఆశలను నెరవేర్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఇందిరమ్మ కమిటీ చైర్మన్ కంచం కోటేశ్వరరావు కి మరియు గ్రామ కాంగ్రెస్ కమిటీ కి మొక్క రాములు దంపతులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు వలమల వెంకట్రామయ్య, బోల్లికొండ మధు, జిల్లపల్లి పెద్ద పుల్లయ్య, కొల్లి కవిత, మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింశెట్టి శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బోలకొండ రామారావు, మాజీ సొసైటీ డైరెక్టర్ వలమల రామారావు, జూవీ పార్టీ నాయకులు పగడాల బాబురావు, కటికల రమేష్, అమరగా

# చిన్నమండవ గ్రామంలో ఘనంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం

- కన్నుల పండువగా ఉత్సవశీ
- రెపరెపలాడి ఎర్రజెండా



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండలం చిన్నమండవ ఘనంగా మేడేలివేడుక ఈ సందర్భంగా సర్పంచ్ పర్చ రామచంద్రరావు మాట్లాడుతూ విశ్వంలో ప్రతిరోజూ ప్రతి పని సక్రమంగా జరుగాలంటే.అందుకు కారణం కార్మికుడే. కార్మికుడు తన చెమట చుక్కలను చిందించి, రక్త మాంసాలను కరిగించి పనిచేస్తేనే ఈ ప్రపంచం ముందుకు సాగుతుంది. వారి శ్రమకు తగిన గుర్తింపు ఇస్తూ జరుపుకునే పండుగే కార్మిక దినోత్సవం. 'మేడే కార్మికుల ఐక్యత, పోరాటాలకు నిదర్శనంగా నిలుస్తుంది. 'మే' డేను అంతర్జాతీయ కార్మిక దినోత్సవం అని కూడా పిలుస్తారని. కార్మిక క్షేత్రాలంటే ముందుగా గుర్తుకు వచ్చేవి సింగరేణి బొగ్గు గనులు, వాటిలో పని చేసే కార్మికులు అలాగే దేవా పూర్ సిమెంట్ కంపెనీ, జైపూర్ పవర్ ప్లాంట్‌తోపాటు సంఘటిత, అసంఘటిత కార్మికులు పని చేసే సంస్థలన్నీ గుర్తుకు వస్తాయని అన్నారు. ఆయా రంగాల కార్మికుల హక్కులను గుర్తు చేస్తూ ఉత్సవాలు జరుపుకునే రోజునే 'మే' డేగా పిలుస్తుంటారని అన్నారు.
కార్మికులు పోరాడి సాధించుకున్న రోజు....19వ శతాబ్దంలో పరిశ్రమల్లో పని చేసేందుకు అసంఖ్యా కంగా కార్మికుల అవసరం ఏర్పడింది. పెట్టుబడి దారులు శ్రామికులతో బానిసల్లాగా పని చేయించి అధిక లాభాలు పొందుతుండేవారు. కనీస వసతులైన తిండి, బట్ట, నివాసం వంటివి కల్పించకుండా కనీసం రోజుకు 16 నుంచి 20 గంట లు పని చేయించేవారు. పని స్థలాల్లో సరియైన గాలి, వెలుతురు ఉండేవి కావని దాంతో కొందరు కార్మికులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయేవారని. ఈ పరిస్థితికి భిన్నంగా, శ్రమదోపిడీ నుంచి బయటపడేందుకు కార్మికులు తమ హక్కుల కోసం రక్తం చిందించి పోరాడి సాధించుకున్న రోజే 'మే' డే. కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు ఇస్తూ ఎనిమిది గంటల పని దినం అమల్లోకి రావడంతో జరుపుకునే పండుగే కార్మిక దినోత్సవంగా జరుపుకుంటామని అన్నారు..

**హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటం....**

'మే' డే ఒక చారిత్రాత్మక చైతన్య దినం. చికాగోలో ఉన్న కొంత మంది ప్రాణత్యాగం చేసి ప్రపంచంలోని కార్మిక వర్గాలకు కొత్త వెలుగును ప్రసాదించిన రోజు. ప్రజల శ్రమను రోజుల తరబడి దోచుకున్న సమయంలో మేమూ మనుషులమే...మా శక్తికి కూడా పరిమితులుంటాయి..ఈ చాకిరీ మేం చేయలేమని పనిముట్లు కింద పడేసి ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడి చివరకు ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించడం కార్మిక వర్గ పోరాట పటిమకు నిదర్శనం. 24 గంటలలో ఎనిమిది గంటలు పని, ఎనిమిది గంటలు విశ్రాంతి, ఎనిమిది గంటలు రిక్రియేషన్ అన్న పద్ధతిని కార్మికులు పోరాటం ద్వారా సాధించుకున్నారు. చికాగో పోరాటం కంటే ముందే భారత దేశంలో కలకత్తాలో కార్మికులు నిర్ణీత పని గంటల కోసం హౌరా రైల్వే స్టేషన్‌లో 1862లో సమ్మె చేశారు. అప్పటి వరకు రైల్వే కార్మికులు 10 గంటలు పని చేసేవారు. అయితే ఆ పోరాటం విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారకపోవడంతో ఉద్యమ స్వరూపాన్ని అందుకో లేదు. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటం మూలంగా అప్పటి నుంచే కార్మికవర్గంలో చైతన్యం పెరగడం మొదలైంది. 1923లో మొదటిసారిగా భారత దేశంలో 'మే' డేను పాటించారని. అప్పటి నుంచి ప్రతి యేడు కార్మికులు ఐక్యంగా 'మే' డేను పాటిస్తున్నారు. 1985 తర్వాత చోటు చేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మిక వర్గాలు కార్మిక చట్టాల అమలుకు నోచు కోవడం లేదు. మార్కెట్‌లో శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం ఉందో అక్కడే కంపెనీలు పెట్టేవారు. అమెరికాలో ఉన్న కంపెనీలు అక్కడ ప్రజా చైతన్యం ఉన్నది కాబట్టి. కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ కార్మికులతో 10 నుంచి 12 గంటల వకు పని చేయించేవారు. ఇప్పటికీ దేశంలో అక్కడక్కడ ఈ శ్రమ దోపిడీ కళ్లకు గట్టినట్లు కనిపిస్తుంటుంది. వివిధ రంగాల్లో విద్యావంతులైన యువత నేడు అధిక శ్రమదోపిడీకి గురవుతూనే ఉన్నారు.
పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నంత వరకు శ్రమదోపిడీ సర్వసా?ధారణం. కార్మిక చట్టాలను పారిశ్రామిక రంగంలో అమలు కోసం పోరాటం అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలక వర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలిస్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటిత రంగంలో అయితే ఇది మరింతగా విస్తరించింది. ప్రభుత్వాలు కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్ విధానంలోనూ కార్మిక చట్టాల నియమాలు అమలు కావ డం లేదు. పైగా ప్రభుత్వరంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తూ కాంట్రాక్టీరణ చేపడుతున్నారు. ప్రైవేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తగ్గుముఖం పడుతోంది. ఫలి తంగా శ్రమదోపిడీ పెరుగుతోంది. ప్రపంచీకరణ వల్ల వందల ఏళ్ల క్రితం సాధించిన కనీస డిమాండ్లు కూడా నేడు అమలు కు నోచుకోవడం లేదు. ప్రపంచ వ్యాప్తంగా 1886లో ఆరంభమైన ఈ ఉద్యమం నేడు 140 ఏళ్ల పండుగ జరుపుకోవడం జరుగుతుందని సర్పంచ్ రామచంద్రరావు అన్నారు . ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ గుండ్ల బేబీ రాణి ,గుండ్ల భద్రమ్మ తుపాకుల లక్ష్మీనారాయణ, దారెల్లి నాగరాజు ,సోంపోగు ఏసోబు అంజయ్య, గంటల స్వామి దాసు ,కోటయ్య , జొన్నలగడ్డ పులరావు, వల్లపట్ల వెంకయ్య సైదులు, తంగిరాల తిరుపయ్య,పాల్గొన్నారు ..

## శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న చింతకాని మండలం నాయకులు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**తుమ్మలమ్మ చెరువు వద్ద కొలువుదీరిన శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా కళ్యాణమునకు హాజరై. మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న. చింతకాని గ్రామం మాజీ సర్పంచ్ మరియు ఖమ్మం జిల్లా మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడుపల్లి భాస్కర్ గౌడ్ దేవదాయ శాఖ అధ్యక్షులు తోటకూరి వెంకటేశ్వరరావు చెన్నై కేశవ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఎండపల్లి శ్రీనివాసరావు కిసాన్ సేల్ అధ్యక్షులు కొప్పుల గోవిందరావు కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు సౌజన్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్రానపు రామయ్య పెద్ద గౌండ్ల వెంకటనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్.... మొక్కజొన్నల చేలకు మంటలు..



**సి కె న్యూస్, చింతకాని ప్రతినిధి** చింతకాని గ్రామంలో నిద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి మొక్కజొన్న పంటచేలకు అంటుకోవడంతో ఈదురు గాలులకు మంటలు చెలరేగి బీభత్సం సృష్టించడం వలన తోటి రైతుల మొక్కజొన్న కంకు కాలిపోతున్న సమయంలో చింతకాని గ్రామానికి చెందిన రైతు దేశ బోయిన వెంకటేశ్వర్లు నా/నా పుల్లయ్య ఇతను చెల్లించి అతనికి ఉన్నటువంటి ట్రాక్టర్ సహాయంతో మిగతా పంటచేలకు కూడా ఈ మంటలు వెళ్లకుండా ఆపే ప్రయత్నం చేయగా అతను నడుపుతున్నటువంటి ట్రాక్టర్ అకస్మాత్తుగా డీజిల్ అయిపోవడంతో ఒక్కసారిగా ఆగిపోగా అంతలోనే మంటలు క్షణాల వ్యవధిలో ట్రాక్టర్ ను చుట్టుముట్టడంతో అతను హుటా హుటీగా తను ప్రాణాలను కాపాడుకోవడం కోసం ట్రాక్టర్ను వదిలి వెళ్ళగా ట్రాక్టర్ పూర్తిగా అగ్నికి ఆహుతి కావడం జరిగినది దయచేసి ప్రభుత్వం వారు జరిగిన చర్యను గమనించి పంట నష్టం జరిగిన రైతులకు ట్రాక్టర్ నష్టపోయిన రైతుకు సహాయ చర్యలను చేపట్టవలసినదిగా రైతుల తరఫున ప్రభుత్వం వారికి విజ్ఞప్తి చేయడం జరుగుతున్నది.

# మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్లో మే డే వేడుకలు

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సి కే న్యూస్** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే)ను ఘనంగా నిర్వహించారు.సమాజ నిర్మాణంలో కార్మికుల అపారమైన సేవలను స్మరించుకుంటూ, వారి కృషికి గౌరవం తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఒ జిల్లా మేజిస్ట్రేట్ మిక్కిలినేని మనూ చౌదరి, ఐ.ఏ.ఎస్., ఈ సందర్భంగా కార్మికులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఫైజాన్ అహ్మద్, ఐ.ఏ.ఎస్., అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కూడా కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి కృషి దేశ ఆర్థికాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, న్యాయమైన వేతనాలు, సురక్షితమైన పనివాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్మిక సంక్షేమం కోసం జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ, కార్మిక సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేయడం, కార్మికుల జీవిత స్థితిగతులను మెరుగుపరచడం అత్యంత ముఖ్యమని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని సన్మానించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అంజనేయులు,ఈఎస్ఐ విభాగానికి చెందిన డా. కనక దుర్గాదేవి, ఐటీఐ మెడ్చల్ ప్రిన్సిపాల్ హనుమా నాయక్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మనోహర్ రెడ్డి ని ప్రశంసిస్తూ సత్కరించారు. అదనంగా, బాల కార్మికత్వం నుండి రక్షించబడిన మరియు ప్రస్తుతం విద్యను అభ్యసిస్తున్న కుమారి మీనా ను "బెస్ట్ చైల్డ్ సర్వైవర్"గా గుర్తించి సత్కరించారు. ఆమె పట్టుదల మరియు విద్యపై ఆసక్తిని అధికారులు అభినందించారు. అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం నుండి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ లక్ష్మీపతి కార్మిక సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు.ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ శ్రీమతి రాధిక నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు సాయి సుమన్ పి. మరియు అంజనేయులు కార్మికులకు కొత్త కార్మిక చట్టాలు (లేబర్ కోడ్స్) మరియు ఉద్యోగుల హక్కుల గురించి వివరణ ఇచ్చారు. వారు కార్మికులు తమ హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. జిల్లాలో కార్మికులకు అవగాహన కల్పించేందుకు మే 02 నుండి మే 10 వరకు ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాలలో కార్మిక చట్టాలు, భద్రతా ప్రమాణాలు, సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించబడుతుంది.



# మెదక్ లో ప్రోటోకాల్ రచ్చ

**మెదక్, మే1,**
మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం ఒకప్పుడు కమ్యూనిస్టుల కంచుకోట. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ పాగా వేసింది. ఇక 2014 నుంచి బీఆర్ఎస్ వరుసగా గెలిచి హ్యాట్రిక్ కొట్టింది. ప్రస్తుతం కారు పార్టీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి. కానీ.... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో....ఇక్కడ తరచూ ప్రోటోకాల్ వివాదాలు రేగుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న ఇతర నియోజకవర్గాల్లో ఇలాంటి గొడవలు పెద్దగా లేకున్నా....నర్సాపూర్‌లో మాత్రం రచ్చో రచ్చస్య అన్నట్టుగా ఉంటోందట. రెండేళ్ల క్రితం అప్పటి ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ నియోజకవర్గంలో బడిబాట కార్యక్రమానికి వచ్చారు.అప్పుడు కాంగ్రెస్ ఇన్చార్జ్ రాజిరెడ్డికి స్కూల్ లో ఓ రూమ్‌కి రిబ్బన్ కట్‌చేసే అవకాశాన్ని మంత్రి సురేఖ ఇవ్వడాన్ని ఎమ్మెల్యే సునీత వ్యతిరేకించారు. ఎటువంటి ప్రోటోకాల్ లేని రాజిరెడ్డితో క్లాస్ రూమ్ ఎలా ఓపెనింగ్ చేయిస్తారన్నది ఎమ్మెల్యే అభ్యంతరం. ఆ సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగాయి. ఆ తర్వాత కూడా ప్రతి సందర్భంలో ఎక్కడో ఒకచోట ప్రోటోకాల్ రగడ నడుస్తూనే ఉంది. ఇక తాజాగా ఇన్చార్జ్ మంత్రి వివేక్ నర్సాపూర్ పర్యటనలో ప్రోటోకాల్ వివాదం చినికి చినికి గాలి వానలా మారింది. నియోజకవర్గంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదన్న ఎమ్మెల్యే వాదనతో రచ్చ జరిగింది. గతంలో ఇదే అంశంపై అసెంబ్లీ స్పీకర్‌కు కూడా ఫిర్యాదు చేశారామె. నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలోనూ ప్రోటోకాల్ అంశంతో మొదలైన గొడవ చివరికి రాజకీయ విమర్శల వరకు వెళ్లింది. దీంతో ఇప్పుడు నియోజకవర్గంలోని అధికారులు ప్రభుత్వ

కార్యక్రమాలు నిర్వహించాలంటేనే హడలిపోతున్నారట.ఏ కార్యక్రమంలో ఏమవుతుందోనని ఆందోళన పెరుగుతోంది. మంత్రి వివేక్, ఎమ్మెల్యే సునీత వర్గాల మధ్య గొడవ జరిగినప్పుడు జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ రంగంలోకి దిగి నేతలకు నచ్చజేప్పేందుకు యత్నించినా ఫలితం లేదంటే సమస్య ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు పరిశీలకులు. అయితే ప్రోటోకాల్ సమస్యపై ఎమ్మెల్యే సునీత చేస్తున్న పోరాటం కరెక్టేనన్నది బీఆర్ఎస్ వెర్షన్. కానీ... కాంగ్రెస్ నాయకులు మాత్రం ఎమ్మెల్యే వైఖరిని తప్పుపడుతున్నారు. మంత్రి మాట్లాడుతుంటే... మధ్యలో ఓ ప్రజాప్రతినిధి కలగజేసుకుని కార్యక్రమాన్ని డిస్టర్బ్ చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు అధికార పార్టీ నాయకులు. మంత్రి హోదాలో ఉన్న వ్యక్తికి ఎమ్మెల్యే ఇచ్చే గౌరవం ఇదేనా అని కౌంటర్ ఇస్తున్నారు. ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే సమయంలో తాము ఏమీ అనలేదని...ఆమె అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిస్తుంటే అంత రాద్ధాంతం చేయాల్సిన అవసరం ఏముందన్నది కాంగ్రెస్ వాదన.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో... ఎంత మాత్రం ప్రోటోకాల్ పాటించారో... సునీతా లక్ష్మారెడ్డి ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటే మంచిదన్నది కాంగ్రెస్ వెర్షన్. నర్సాపూర్ నియోజకవర్గంలో పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెరుగైన స్థానాలు సాధించడం, ఎమ్మెల్యే స్వగ్రామం గోమారంలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థే సర్పంచ్ గా గెలవడం, మున్సిపల్ ఎన్నికల్లోనూ నర్సాపూర్ మున్సిపాలిటీని అధికార పార్టీ కైవసం చేసుకోవడంతో ఎమ్మెల్యే సునీత ఫ్రస్టేషన్‌లో ఉన్నారంటూ ప్రచారం చేస్తోంది కాంగ్రెస్. తాను కాంగ్రెస్‌ను వీడిన తర్వాత బలహీనంగా కనిపించిన పార్టీ క్యాడర్... ఆవుల రాజిరెడ్డి రాక తర్వాత బలపడటాన్ని ఆమె జీర్ణించుకలేకపోతోందంటూ ప్రచారం చేసుకుంటున్నారు హస్తం నేతలు. నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కంటే అధికారులు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డికే ప్రాధాన్యం ఇస్తున్నారట. ఈ పరిస్థితుల్లో ప్రోటోకాల్ రచ్చ ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదని అంటున్నారు పరిశీలకులు. ప్రభుత్వ కార్యక్రమాల కోసం మంత్రులు వచ్చిన ప్రతిసారి గొడవ జరగడం కామన్ అయిపోతోంది. దీంతో...అఫీషియల్ ప్రోగ్రామ్స్ అంటేనే హడలిపోతున్నారట ప్రభుత్వ అధికారుల

# నష్టనివారణ చర్యల్లో మంగ్లీ

**హైదరాబాద్ ,మే1,**
సింగర్ మంగ్లీ ఆరోపణలు ఎదుర్కొంటున్న మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసు ప్రకంపనలు రేపుతూనే ఉంది. బాధితులు రోడ్డెక్కుతుండటం, బాధితుల తరపున గిరిజన సంఘాల నేతలు పోరాటం చేస్తుండటం మరింత హీట్ పెంచుతోంది. అయితే.. తనపై వస్తున్న ఆరోపణలపై మంగ్లీ ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. మైక్రో ఫైనాన్స్ బాధితులకు అన్యాయం జరిగిందన్న మంగ్లీ..బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని ప్రకటించారు. కొందరు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని.. ఈ ఆర్థిక మోసంలో తనకుఎ ఎలాంటి ప్రమేయం లేదని చెప్పుకొచ్చారు.. ఈ సమయంలోనే.. తనపై పెట్టిన కేసుపై మరోసారి మంగ్లీ స్పందించారు. రమావత్ మధుపై విరుచుకుపడిన సింగర్ మంగ్లీ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. దుర్మార్గుడు అని తెలియక మాట్లాడిన పాపానికి.. పట్టుబడితే నా బ్యాండ్‌తో కలిసి ఇంటికెళ్లి భోజనం చేశానన్నారు. ఒకపూట భోజనం చేసిన పాపానికి క్షోభ అనుభవిస్తున్నా.. అంటూ పేర్కొన్నారు.కొందరు కావాలనే ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారని మంగ్లీ పేర్కొన్నారు. ఏ ఆధారాలు లేకుండా తన చుట్టూ కుట్రలు పన్నుతున్నారని.. రమావత్ మధు చేసిన మోసాల్లో తనకు 1శాతంకూడా సంబంధం లేదన్నారు. ప్రజల్ని మోసం చేసి రక్తపు కూడు తినే మనిషిని కాదన్నారు. తన కుటుంబ సభ్యులకూ ఈ మోసంతో సంబంధం లేదన్నారు. బండి శివ పేరుని తన తమ్ముడు శివచౌహాన్‌గా ప్రచారం చేస్తున్నారన్నారు. పదే పదే అబద్ధాన్ని వందసార్లు చెప్పి నిజం చేయాలనుకుంటున్నారని.. తాను.. తన కుటుంబ సభ్యులు ఎక్కడికీ పారిపోలేదని పేర్కొన్నారు. అంతిమంగా నిజమే గెలుస్తుంది అంటూ మంగ్లీ నోట్ విడుదల చేశారు.ఇటీవల ఈ ఫ్రాడ్ కేసు బాధితుడు నల్గొండ జిల్లా పెద్దవూరకు చెందిన పాల్తి రమేష్ అనే వ్యక్తి ఆత్మహత్యకు



పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో మంగ్లీ నోట్ విడుదల చేసింది. రమావత్ మధు బాధితుడిగా అభివర్ణిస్తూ మంగ్లీ తాను విడుదల చేసి నోట్‌లో రాసుకొచ్చింది. ఆయన మృతి బాధాకరమని చెబుతోంది మంగ్లీమరోవైపు మైక్రో ఫైనాన్స్ స్కామ్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు మంగ్లీ సోదరుడు శివ చౌహాన్.. మంగ్లీపై కుట్రపూరితంగానే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. అడ్వొకేట్ సుబ్బారావు ఆరోపణలు నిరాధారమన్నారు. ఈ కేసులో వాస్తవాలు ఏంటనేది పోలీసు విచారణలో తేలుతాయన్నారు.
తమపై నిరాధార ఆరోపణలు చేసిన వాళ్లకు చట్టపరంగానే సమాధానమిస్తామని అంటున్నారు మంగ్లీ సోదరుడు శివ చౌహాన్..

# తెలంగాణపై బీజేపీ నజర్



**హైదరాబాద్ ,మే1,**
తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఖరారు కావడంతో రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారి తెలంగాణ గడ్డపై అడుగుపెడుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. మే 10న హైదరాబాద్ వేదికగా జరగనున్న ఈ పర్యటన కేవలం ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితం కాకుండా, రాబోయేఎన్నికలకు శంఖారావంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.మే 10న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు బీజేపీ సర్వసన్నద్ధమవుతోంది. ఈ సభకు 'జానగ్రహ సభ' అని పేరు పెట్టింది. గత ఎన్నికల్లో సాధించిన విజయాలు, ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకోవాలనే లక్ష్యంతో ఈ పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ సభ ద్వారా రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ పార్టీలపై నేరుగా విమర్శనాస్త్రాలు సంధించే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున జన సమీకరణ చేసి, కేడర్‌లో నూతన ఉత్తేజాన్ని నింపాలని హైకమాండ్ భావిస్తోంది.రాజకీయ సభతో పాటు, హైదరాబాద్ పరిధిలో దాదాపు రూ.7,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మౌలిక సదుపాయాలు, రవాణా, ఇతర ప్రజాహిత కార్యక్రమాలకు సంబంధించిన ఈ భారీ కేటాయింపుల ద్వారా తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ భావిస్తోంది.ఈ ఏడాది జరగనున్న జీహెచ్ఎంసీ మేయర్ ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ తన అడుగులు వేస్తోంది. గత ఎన్నికల్లో అనూహ్య రీతిలో పుంజుకున్న బీజేపీ, కాంగ్రెస్‌ను మూడో స్థానానికి
పరిమితం చేసి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. ఈసారి ఎలాగైనా మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. మే 4న విడుదలయ్యే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘనవిజయం
సాధిస్తుందని ఆ పార్టీ నమ్మకంగా ఉంది. ఆ గెలుపు ఉత్సాహంతో తెలంగాణలో 'ఆపరేషన్ తెలంగాణ'ను ప్రారంభించి, దక్షిణాదిలో తన పట్టును మరింత బిగించాలని చూస్తోంది.కర్ణాటక తర్వాత దక్షిణాదిలో తెలంగాణనే తమకు అనుకూలమైన రాష్ట్రమని బీజేపీ మొదటి నుంచీ చెబుతోంది. అయితే, రాష్ట్ర పార్టీలో ఉన్న అంతర్గత విభేదాలు కొంతకాలంగా ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర నాయకత్వం నేరుగా రంగంలోకి దిగింది. వర్గపోరుకు చెక్ పెట్టి, పార్టీని బలోపేతం చేసేందుకు హైకమాండ్ ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ప్రధాని మోదీ పర్యటన ద్వారా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసి,
కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునివ్వనున్నారు.మొత్తానికి మే 10న జరిగే ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు నాంది పలుకుతుందా? 'జానగ్రహ సభ' ద్వారా బీజేపీ తన సత్తా చాటుతుందా? అనేది ఇప్పుడు అత్యంత ఆసక్తికరంగా మారింది. ఒకవైపు అభివృద్ధి పనులు, మరోవైపు రాజకీయ ఎత్తుగడలతో తెలంగాణను కైవసం చేసుకునేందుకుకమలనాథులు వేస్తున్న స్కెచ్ ఏ మేరకు పారుతుందో వేచి చూడాలి.

## లీస్ట్, లాస్ట్ హైదరాబాదే...

**హైదరాబాద్ ,మే1, :** తెలంగాణ రాష్ట్ర పదో తరగతి ఫలితాల్లో రాజధాని హైదరాబాద్ జిల్లా తన ఉనికిని కోల్పోయి చిట్టచివరి స్థానానికి పడిపోయింది. బుధవారం విడుదలైన ఫలితాల ప్రకారం గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాలు ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేకపోయాయి. గతేడాది 30వ స్థానంలో ఉన్న హైదరాబాద్ జిల్లా, ఈసారి మరో మూడు స్థానాలు దిగజారి 33వ ర్యాంకుతో సరిపెట్టుకుంది. రంగారెడ్డి జిల్లా 31 నుంచి
30వ స్థానానికి చేరుకోగా, మేడ్చల్ జిల్లా మాత్రం 28 నుంచి 24వ స్థానానికి మెరుగుపడి కొంత పరువు దక్కించుకుంది. హైదరాబాద్‌ను టాప్ టెన్ జాబితాలోకి తెస్తామన్న విద్యాశాఖ అధికారుల ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శలు వస్తున్నాయిఈ ఏడాది ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుండి మొత్తం 1.76 లక్షల మంది పరీక్షలు రాయగా, అధిక సంఖ్యలో బాలికలు ఉత్తీర్ణత సాధించారు. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 96 శాతానికి పైగా విద్యార్థినులు పాస్ అవ్వగా, రంగారెడ్డిలో 94.78 శాతం, హైదరాబాద్‌లో 91.40 శాతం మంది విద్యార్థినులు విజయం సాధించారు. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం మెరుగైనప్పటికీ, ఇతర జిల్లాలతో పోటీ పడటంలో ఇక్కడి విద్యార్థులు వెనుకబడ్డారు. రాజ్‌భవన్ ఉన్నత పాఠశాలలో 30 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి ఆదర్శంగా నిలిచారు.జిల్లాల వారీగా 2026 ఫలితాలను పరిశీలిస్తే, మేడ్చల్ జిల్లా 95.24 శాతం ఉత్తీర్ణతతో 24వ స్థానంలో నిలిచింది.
రంగారెడ్డి జిల్లా 92.96 శాతంతో 30వ స్థానంలో ఉండగా, హైదరాబాద్ జిల్లా 89.23 శాతంతో 33వ స్థానానికి పరిమితమైంది. విద్యా సంవత్సరం ప్రారంభం నుండి విద్యార్థుల చదువులపై శ్రద్ధ చూపడంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పాఠశాలల పర్యవేక్షణ లోపించడం, కేవలం సమీక్షలకే పరిమితమవ్వడం వల్ల ఈ దారుణ ఫలితాలు
వచ్చాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు విద్యాశాఖలో అక్రమ బదిలీలు, సిఫార్సుల ప్రభావం కూడా ఫలితాలపై పడిందని తెలుస్తోంది. కొంతమంది ఉపాధ్యాయులు రాజకీయ సిఫార్సులతో నగరంలోని ఉన్నత పాఠశాలలకు బదిలీపై వచ్చి, బోధన కంటే ఇతర అంశాలపైనే దృష్టి సారించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సరిగ్గా హాజరు కాకపోయినా అధికారులు పట్టించుకోలేదని, ప్రైవేటు పాఠశాలలపై ఉన్న ఆసక్తిని ప్రభుత్వ బడులపై చూపడం లేదని ఫలితాల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## కమలంలో ఆగని కుమ్ములాటలు

**కరీంనగర్ ,మే1, :** తెలంగాణ బీజేపీ నేతల తీరును సొంత పార్టీ కేడరే ఎండగడుతోంది. వ్యక్తిగతంగా వాళ్ళకు అక్కడ పదవులతో పని లేకున్నా... పార్టీని అధికారంలో నిలపాలన్న తాపత్రయంతో పెద్దోళ్ళంతా అలా కష్టపడుతున్నారు. కానీ.... ఇక్కడ తెలంగాణలో పార్టీని నిలిపి గెలిపిస్తే... ముఖ్యమంత్రి నుంచి మంత్రి పదవుల దాకా... వీళ్ళకే కదా... వస్తాయి, అయినా సరే... రాష్ట్ర బీజేపీ నాయకులు ఎందుకు నిర్లిప్తంగా ఉంటున్నారు, కనీస యాక్టివిటీ కూడా ఎందుకు ఉండటం లేదని కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకుల్లో చర్చ జరుగుతోంది. పైగా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడుతున్నారు. ఇక్కడ పార్టీని గెలిపిస్తే... తమకు పదవులు వస్తాయని తెలిసి కూడా ఇగోకి పోతూ... ఉన్న అవాకాశాలను కూడా ఉపయోగించుకోవడం లేదని అంటున్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా... కమలంలోని పెద్దలు అక్కడ వాలిపోతారు.గెలుపు కోసం విస్తృత ప్రచారం చేస్తారు. అక్కడి కేడర్‌లో భరోసా నింపే ప్రయత్నం చేస్తారు. ఆ రూపంలో పార్టీకి ఊపు వస్తుంది. ప్రస్తుతం
పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో జరుగుతోంది కూడా ఇదే. ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా...బెంగాల్‌లో గెలుపును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇంకా చెప్పాలంటేచెప్పులరిగేలా తీరుగుతున్నారని చెప్పుకోవచ్చు. బీజేపీకి చెందిన మిగతా అగ్ర నాయకులు కూడా అదే స్థాయి ఫోకస్ పెట్టారు. సరిగ్గా ఈ పాయింట్‌నే లేవనెత్తుతూ తెలంగాణ బీజేపీ నాయకులు వాళ్లని చూసి ఎప్పుడు నేర్చుకుంటారంటూ డిస్కస్ చేసుకుంటున్నారు కింది స్థాయిలో. బెంగాల్‌లో గెలిస్తే...పార్టీ ఖాతాలోకి మరో రాష్ట్రం వస్తుంది. అంతే తప్ప... నేషనల్ లీడర్స్ అందరికీ అక్కడేం పదవులు రావు, ప్రత్యేకంగా ఒరిగేదేం లేదు. అయినా సరే వాళ్ళంతా అంత కష్టపడుతుంటే... ఇక్కడ మాత్రం ముఖ్యమంత్రి పీఠం సహా... రకరకాల పదవులు రాష్ట్ర నేతలకే దక్కే అవకాశం ఉన్నా... ఎందుకు నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారంటూ ఫైరైపోతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో పాగా వేయాలని పెద్దవాళ్ళు పడుతున్న తాపత్రయం... తిరుగుతున్న తీరు... తెలంగాణ నేతలకు కనిపించడం లేదా అన్న ప్రశ్న వస్తోంది కేడర్ నుంచి. వాళ్లని చూసైనా.... మా నాయకులు ఇగోలు పక్కన పెట్టాలని అంటున్నారు. పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తున్న నేషనల్ లీడర్స్‌కు, పార్టీ కన్నా మేమే గొప్ప అనుకుంటున్న స్టేట్ టనాయకులకు చాలా తేడా ఉందని, ఆ సంగతి గమనించుకుని ఇకనైనా రాష్ట్ర పార్టీ నాయకులు మారితేనే తెలంగాణలో వాళ్ళకైనా, పార్టీకైనా భవిష్యత్ అన్నది కార్యకర్తల మాట. క్షేత్ర స్థాయిలో పని చేయడానికి
మేం సిద్ధంగా ఉన్నా...నడిపించడానికి వాళ్లు రెడీగా లేరు, ఆ ఇగోలతో ఎన్నాళ్లని నడిపిస్తారని సొంతోళ్ళే మాట్లాడుకుంటున్నారు. మారండయ్యా..... ఇకనైనా మారిపోండయ్యా..... పై వాళ్ళని చూసి నేర్చుకోండయ్యా..... అంటున్న తెలంగాణ బీజేపీ కార్యకర్తల మాటను రాష్ట్ర నాయకులు ఎంతవరకు పరిగణనలోకి తీసుకుంటారో చూడాలి.

## వలస నేతలే దిక్కా

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్‌లో ఇప్పుడు వలస నేతల హవానే నడుస్తోంది. ఎక్కడ చూసినా వాళ్ళే కనిపిస్తున్నారు. మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి నుంచి మొదలు.. ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, కాలె యాదయ్య, మనోహర్ రెడ్డి.. ఇలా ఒకరేమిటి...జిల్లాలో పొలిటికల్ హేమా హేమీలని చెప్పుకునే వాళ్ళలో ఎక్కువ మంది ఇప్పుడు హస్తం గూటికే చేరారు. వాళు పార్టీ మారడం సంగతి ఎలా ఉన్నా... ఆ తర్వాతే అసలు చిక్కులు మొదలయ్యాయట. నాయకుల వెనకే వచ్చిన అనుచరుల పరిస్థితి ఇప్పుడు త్రిశంకు స్వర్గంలో ఉన్నట్టయిందని అంటున్నారు. పార్టీ జిల్లా, డివిజన్, వార్డు కమిటీల్లో తమ వారికి పదవులు ఇప్పించుకుందామంటే... పీసీసీ పెట్టిన త్రీ ఇయర్స్ రూల్ ప్రతిబంధకంగా మారింది. పార్టీలో కనీసం మూడేళ్లు పనిచేస్తేనే పదవి ఇవ్వాలన్నది రూల్. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కుఅధిష్టానం నుంచి ఉన్న క్లియర్ కట్ లైన్ ఇది. 2023 ఎన్నికల కంటే ముందు నుంచి ఎవరైతే పార్టీని నమ్ముకుని ఉన్నారో, వారికే ప్రస్తుత కమిటీల్లో చోటు కల్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. జంపింగ్ జపాంగ్‌లకు పార్టీలోకి వచ్చిన వెంటనే పదవులు ఇస్తే.. మొదటి నుంచి కష్టపడ్డ వారికి అన్యాయం జరుగుతుందని భావిస్తోంది అధిష్టానం.దీంతో ఏళ్ల తరబడి జెండా మోసిన పాత కాపులు ఖుషీ అవుతుంటే.. వలస నేతల కేడర్‌లో మాత్రం నిరాశ పెరుగుతోందట. పదవులు లేకపోతే పార్టీలో మా ఉనికి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. మహిళా నేతల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్టు తెలిసింది.

CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక

# బెజవాడ వైసీపీకి నేతలు కావలెను..

ఉమ్మడి కృష్ణా జిల్లాలో వైసీపీ... నియోజకవర్గ సమన్వయకర్తల పనితీరు ఇప్పుడు పార్టీలోనే చర్చగా మారింది. మొత్తం 16 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా... 2024 ఎన్నికల్లో ఒక్క చోట కూడా
పార్టీ బోణీ కొట్టలేదు. కూటమి పార్టీలు వంద శాతం సీట్లు గెల్చుకోగా...జిల్లాలో వైసీపీ జీరో అయింది. అయితే... అంత ఘోరమైన ఓటమి నుంచి కూడా త్వరగా కోలుకున్న పార్టీ అధిష్టానం రెండేళ్ళుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమాలకు పిలుపునిస్తోంది. కానీ... ఉమ్మడి కృష్ణాలోని నియోజకవర్గాల ఇన్చార్జ్‌లు చాలామంది అధిష్టానం పిలుపునిచ్చిన స్థాయికి తగ్గట్టుగా స్పందించడం లేదన్నది పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న చర్చ. ఈ వ్యవహారం పెద్దల దృష్టికి కూడా వెళ్ళిందట. దీంతో వివిధ నియోజకవర్గాల ఇన్చార్జ్‌లు, స్థానిక నేతల పనితీరుకు సంబంధించిన ఫీడ్
బ్యాక్ రిపోర్ట్స్ తెప్పించుకుంటున్నట్టు తెలుస్తోంది.నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల అక్రమాలకు సంబంధించి స్థానిక పార్టీ నేతలు అనుకున్న స్థాయిలో రెస్పాండ్ అవ్వటం లేదన్నది ఫ్యాన్ అధిష్టానం అభిప్రాయం. కేవలం కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే ఇన్చార్జ్‌లు అనుకున్న స్థాయిలో స్పందిస్తున్నారని, ఎక్కువ చోట్ల సైలెంట్ మోడ్‌లో ఉండటంపై ఆరా తీస్తున్నారట. ప్రధానంగా మచిలీపట్నం రాజకీయాలు గతంలో
లేనంత హాట్ హాట్ గా మారిపోయాయి. ఇక్కడ నిత్యం మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి పేర్ని నాని వర్గాల మధ్య నువ్వా నేనా అన్నట్టు ఉంటోంది. మంత్రికి వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు పేర్ని. నియోజకవర్గంలో ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలిగితే వాటిపై కూడా క్షేత్రస్థాయికి వెళ్ళి ఆందోళనకు దిగుతున్నారు. పామర్రులో ఇసుక, మట్టి దోపిడీ, పేకాట, చెరువు తవ్వకాల మీద మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ ఆందోళన చేయటంతో పాటు సోషల్ మీడియాలో కూడా ఎమ్మెల్యే తీరుపై విమర్శలు చేస్తున్నారు. పెనమలూరులో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యవహారాలపై ఇన్చార్జ్ దేవభక్తుని చక్రవర్తి
నిత్యం ఆందోళనకు చేయటం ద్వారా ఎమ్మెల్యే కంట్లో నలుసుగా మారారనేది లోకల్ టాక్.అటు నందిగామలో మొండితోక బ్రదర్స్ వర్సెస్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్న విధంగా వ్యవహారం మారింది. ఈ పోరులో మొండి తోక బ్రదర్స్ పై స్థానికంగా పలు కేసులు కూడా నమోదయ్యాయి. అటు వల్లభనేని వంశీ కూడా ఎన్ని కేసులు పెడుతున్నా గన్నవరంలో ఇళ్ళ పట్టాల సమస్యకు సంబంధించి నేరుగా జిల్లా కలెక్టర్ కలిసి మరి ఫిర్యాదులు చేస్తున్నారు. మైలవరంలో ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్, ఆయన బావమరిది పోసాని కోటేశ్వర రావు నియోజకవర్గాన్ని దోచుకుంటున్నారంటూ ఆరోపిస్తున్నారు జోగి రమేష్. బూడిద, మైనింగ్,మట్టి అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ధ్వజమెత్తుతున్నారాయన. వీళ్ళు తప్ప మిగతా ఎవరూ... పార్టీ ఆశించిన స్థాయిలో పని చేయడం లేదని వైసీపీ అధిష్టానం గుర్తించినట్టు తెలిసింది. ప్రధానంగా విజయవాడ నగరాన్ని పరిశీలిస్తే... ఇక్కడ నుంచి గతంలో వెలంపల్లి శ్రీనివాస్ మంత్రిగా పని చేశారు. కానీ... అధికారం కోల్పోయిన దగ్గర నుంచి ఆయన పార్టీ ఆదేశించిన కార్యక్రమాలకు మాత్రమే పరిమితం అవుతున్నారు తప్ప... నియోజకవర్గంలో పెద్దగా ప్రత్యక్ష ఆందోళనలు నిర్వహించడం లేదని నాయకులే మాట్లాడుకుంటున్నారు.విజయవాడ సెంట్రల్ నుంచి ఇన్చార్జ్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కూడా పెద్దగా నోరు విప్పని పరిస్థితి ఉందనేది లోకల్ టాక్. మల్లాది విష్ణు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బోండా ఉమా సైతం ఆయన మీద పెద్దగా విమర్శలు చేయలేదన్న సంగతి గుర్తు చేసుకుంటున్నారు స్థానికులు. ఎన్నికల సమయంలో గద్దె రామ్మోహన్ పై అనేక విమర్శలు చేసిన తూర్పు నియోజకవర్గ ఇన్చార్జ్ దేవినేని అవినాష్ ఇప్పుడు జిల్లా అధ్యక్షుడు కావడంతో నియోజకవర్గం కంటే జిల్లా వ్యవహారాలపై ఫోకస్ పెడుతున్నారట. ఇక జగ్గయ్యపేటలో కొత్తగా ఇన్చార్జ్ పదవి పొందిన నాగేశ్వరరావు, తిరువూరు ఇన్చార్జ్ స్వామిదాస్ పనితీరు ఆశించిన స్థాయిలో
లేదన్నది అధిష్టానం అభిప్రాయం. వీళ్ళందరి పనితీరుకు సంబంధించి స్థానికంగా ఉన్న నియోజకవర్గాల అబ్జర్వర్ల నుంచి నివేదికలు సేకరించిన అధిష్టానం....సైలెంట్‌గా ఉన్న వాళ్ళని యాక్టివేట్ చేసేందుకు చర్యలు తీసుకోబోతున్నట్టు తెలుస్తోంది.

# ఒక్క లవంగం తిన్నా చాలు బోలెడు లాభాలు



లవంగాలలో ఎన్నో పోషకాలతోపాటు.. ఔషధ గుణాలు దాగున్నాయి.. లవంగాలు వంటలకు మంచి రుచి, సువాసనను ఇస్తాయి. కానీ వాటి వినియోగంపై అపోహలున్నాయి. నిజానికి, తగిన మోతాదులో వాడితే పొట్ట, అన్నవాహిక అల్సర్‌లను నివారించడంలో అద్భుతంగా సహాయపడతాయి. అయితే, మోతాదు మించితే మంట, ఇతర సమస్యలు రావచ్చని 2014 పరిశోధనలు తెలుపుతున్నాయి. లవంగాలలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. లవంగాలు మాంగనీస్, విటమిన్ ఐ, విటమిన్ అ, ఫైబర్‌తో కూడిన అత్యంత పోషకమైన సుగంధ ద్రవ్యాలుగా పరిగణిస్తారు. దీనిలోని యూజెనాల్ అనే యాంటీఆక్సిడెంట్ ఎన్నో సమస్యలను దూరం చేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అయితే.. వంటకాలకు సువాసన, రుచిని అందించే లవంగాలు మన దైనందిన ఆహారంలో ఒక భాగం.. అయితే, లవంగాలు ఎక్కువైతే పొట్టలో మంట, అసౌకర్యం, అల్సర్‌లు వంటి సమస్యలు వస్తాయని చాలామంది భయపడుతుంటారు. ఇది కొంతమందిలో వేడి చేసిన అనుభూతిని కూడా కలిగిస్తుంది. అయితే, లవంగాలపై జరిగిన శాస్త్రీయ పరిశోధనలు ఈ అపోహను పాక్షికంగా తొలగిస్తూ ఒక కీలకమైన వాస్తవాన్ని వెల్లడించాయి. లవంగాలు సరైన మోతాదులో ఉపయోగించినప్పుడు, అవి పొట్టలో, అన్నవాహికలో (ఆహార నాళం) అల్సర్‌లు ఏర్పడకుండా అద్భుతంగా రక్షించగలవని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.లవంగాలలో ఉండే ప్రత్యేకమైన ఘాటుకు కారణమైన రసాయన సమ్మేళనాలు.. మనం తీసుకున్నప్పుడు జీర్ణవ్యవస్థలోని జిగురు పొరలను (ఎబీఇనీబీబ ఎవఎవిఎతీజీనివబ) ఉత్తేజపరుస్తాయి. ఈ ప్రేరణ వల్ల జిగురును ఉత్పత్తి చేసే కణజాలం క్రియాశీలమై, కడుపు, అన్నవాహిక గోడలపై రక్షణ కవచంలా పనిచేసే జిగురు ఎక్కువగా స్రవించేలా చేస్తుంది. ఈ జిగురు పెరగడం వల్ల కడుపులో మంటలు, అల్సర్‌లు వంటివి రాకుండా అడ్డుకుంటుంది. ఎర్ర కారం వంటి వాటి ఘాటుకు ఇలాంటి రక్షణ యంత్రాంగం ఉండదు.. కానీ లవంగాల ఘాటుకు ఈ విశిష్ట ప్రయోజనం ఉంది. అయితే, ఈ ప్రయోజనం మోతాదుకు లోబడి ఉంటుంది. మూడు లేదా నాలుగు లవంగాలను మించి వాడకుండా ఉంటేనే పొట్టలో, అన్నవాహికలో అల్సర్‌ల నుండి రక్షణ లభిస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ మోతాదుకు మించి, అనగా నాలుగైదు లవంగాల కంటే ఎక్కువ వాడినప్పుడు, లవంగాలలో ఉండే రసాయన ప్రభావం అధికమై రివర్స్ సైడ్ ఎఫెక్ట్‌లకు దారితీస్తుంది. ఈ అధిక ప్రభావం వల్ల మంట, ఇరిటేషన్ ఎక్కువైపోయి అసౌకర్యం కలుగుతుంది. ఈ పరిశోధనల వివరాలను 2014వ సంవత్సరంలో బ్రెజిల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ సావోపాలో అందించింది. అందుకనే, లవంగాలు రోజూ వాడితే మంటలు, అల్సర్‌లు వస్తాయనే అపోహ ఉన్నప్పటికీ, సరైన మోతాదులో ఉపయోగించడం
వల్ల అనేక లాభాలు పొందవచ్చు. చాలామంది వెజిటేరియన్ వంటకాల్లో లవంగాలు లేకుండా మసాలాలు వాడతారు.. అయితే ప్రత్యేక వంటకాల్లో, ముఖ్యంగా నాన్-వెజ్ వంటకాల్లో గుమగుమలాడే రుచి కోసం లవంగాలు వాడుతుంటారు. కానీ, తగు రీతిలో వాడుకున్నప్పుడు మాత్రమే లవంగాల వల్ల కలిగే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలను పూర్తిగా పొందగలమని ఈ పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ఆరోగ్య ప్రయోజనాలను పొందాలంటే మోతాదుకు మించకుండా లవంగాలను వాడకూడదు..

# ఎవ్వరికీ తెలియని అద్భుతమైన ఔషధ రహస్యం



మెంతులు మన వంటింటి దినుసులలో దాగున్న అద్భుత ఔషధం. ఇవి ముఖ్యంగా మహిళల ఆరోగ్యానికి, తల్లిపాలు పెంచడానికి, ప్రసవాన్ని సులభతరం చేయడానికి ఉపకరిస్తాయి. అధిక కొలెస్ట్రాల్, మధుమేహం నియంత్రణకు, మలబద్ధకం, జ్వరం, గొంతునొప్పి నుండి ఉపశమనం పొందడానికి మెంతులు ఎంతగానో సహాయపడతాయి. రోజువారీ ఆహారంలో మెంతులను చేర్చుకోవడం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. మన వంటింట్లో ప్రతిరోజు వాడే దినుసులలో మెంతులు ఒకటి.. కేవలం వంటకు రుచిని ఇవ్వడమే కాదు, మెంతులు అద్భుతమైన ఔషధ గుణాలతో నిండి ఉన్నాయని చాలామందికి తెలియదు. ఆరోగ్యానికి, ముఖ్యంగా మహిళల ఆరోగ్యానికి ఇవి ఎంతో మేలు చేస్తాయి. నిత్యం వీటిని సరైన పద్ధతిలో తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే.. ఉదయాన్నే పరగడుపున మెంతుల నీరు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని డైటీషియన్లు చెబుతున్నారు. మెంతుల నీరు.. ఫైబర్, ఐరన్, మెగ్నీషియం, ప్రోటీన్, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలతో కూడిన శక్తివంతమైన పానీయం. రాత్రి నానబెట్టిన మెంతుల నీటిని ఉదయం పరగడుపున తాగడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది.. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.. బరువు తగ్గుదలకు సహాయపడుతుందని డైటీషియన్లు చెబుతున్నారు.మెంతులు, మెంతుల నీరు బాలింతలలో తల్లిపాలు పెంచడానికి ఎంతగానో సహాయపడతాయి. మెంతికూరను ఆహారంలో చేర్చడం లేదా మెంతులతో చేసిన దోసెలు, ఇడ్లీలు తీసుకోవడం ద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుంది.గర్భధారణ సమయంలో, ప్రసవాన్ని సులభతరం చేయడానికి, గర్భాశయ సంబంధ సమస్యలను తగ్గించడానికి మెంతులు ఉపయోగపడతాయి. ప్రసవం తర్వాత పేగుల కదలికను మెరుగుపరచి, నడుము నొప్పి వంటి సమస్యలను నివారిస్తాయి.అధిక కొలెస్ట్రాల్‌తో బాధపడేవారు రోజుకు 10-20 గ్రాముల మెంతులను నీటిలో లేదా మజ్జిగలో కలిపి తీసుకుంటే కొవ్వు కరిగి బరువు తగ్గుతారు.మధుమేహం నియంత్రణకు మెంతులు, మెంతుల నీరు అద్భుత ఔషధం. ప్రతిరోజూ ఒక టీస్పూన్ మెంతి పొడిని మూడు సార్లు తీసుకోవడం లేదా నానబెట్టిన మెంతులను నీటితో పాటు సేవించడం
వల్ల దయాబెటిస్ అదుపులో ఉంటుంది.మలబద్ధకం సమస్య ఉన్నవారు 2-3 చెంచాల నానబెట్టిన మెంతులను తింటే విరేచనం సాఫీగా అవుతుంది.జ్వరం, గొంతునొప్పి తగ్గించడానికి మెంతులు, తేనె, నిమ్మరసం కలిపిన కషాయం ఉపశమనం ఇస్తుంది. ఈ విధంగా మెంతులు మనకు తెలియని ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వాటిని సరైన రీతిలో ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా అనేక సమస్యల నుండి విముక్తి పొందవచ్చు. ఆరోగ్యకరమైన జీవనం కోసం మెంతులను మీ దినచర్యలో చేర్చుకోవాలని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.. ముందుగా రాత్రి పూట మెంతులను నానబెట్టి ఉదయాన్నే ఆ నీటిని తాగడంతోపాటు.. తినవచ్చు.. లేదా మెంతుల పొడిని నీటిలో మరిగించి తీసుకోవచ్చు.. లేకపోతే.. మెంతికూరను మీ ఆహారంలో జోడించుకోండి..

# షుగర్ ఉన్నవారు స్వీట్ కార్న్ తింటే ఏమవుతుంది?



మనం సాయంత్రం పూట చిరుతిండిగా తీసుకునే స్వీట్ కార్న్ రుచిగా ఉండటమే కాదు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. కానీ షుగర్ ఉన్నవారు మాత్రం దీని విషయంలో గందరగోళానికి గురవుతుంటారు. మొక్కజొన్నలో సహజంగానే చక్కెరలు ఉంటాయని.. అది ఆరోగ్యానికి హాని చేస్తుందని కొందరు నమ్ముతారు. ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు కూడా షుగర్ పేషెంట్లకు రక్తంలో చక్కెర స్థాయిలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ క్రమంలోనే చాలా మందికి వచ్చే సందేహం.. స్వీట్ కార్న్ తినవచ్చా? నిజానికి చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఇష్టపడే ఈ స్నాక్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అయితే ఇది తింటే షుగర్ పేషెంట్లకు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుందా..? అనే ప్రశ్న చాలా మందిని వేధిస్తుంటుంది. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ : స్వీట్ కార్న్ ఉఎ స్కోరు 52-55 మధ్య ఉంటుంది. ఇది తక్కువ నుండి మితమైన కేటగిరీ కిందకు వస్తుంది. అంటే ఇతర పిండి పదార్థాల ఆహారాలతో పోలిస్తే, ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచదు.డైటరీ ఫైబర్: ఇందులో పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ నెమ్మదిగా సాగుతుంది. ఫలితంగా చక్కెర శోషణ నిదానంగా జరిగి ఇన్సులిన్ స్పైక్స్ రాకుండా ఉంటాయి.అద్భుతమైన యాంటీఆక్సిడెంట్స్: ఇందులో ఉండే లుటీన్, జియాక్సంతిన్ కంటి చూపును మెరుగుపరుస్తాయి. మధుమేహం వల్ల వచ్చే కంటి సమస్యల నుంచి రక్షణ కల్పిస్తాయి. అధిక కార్బోహైడ్రేట్లు: స్వీట్ కార్న్‌లో పిండి పదార్థాలు సహజంగానే ఎక్కువగా ఉంటాయి. కాబట్టి మోతాదు మించితే రక్తంలో చక్కెర పెరగడం ఖాయం.ప్రాసెస్ చేసిన ఉత్పత్తులు: డబ్బాలో నిల్వ చేసిన లేదా స్వీటెనర్లు కలిపిన స్వీట్ కార్న్ ఉత్పత్తులు మధుమేహులకు అత్యంత ప్రమాదకరం. వీటిలో సోడియం, షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. మోతాదు ముఖ్యం: రోజువారీ ఆహారంలో ఒక చిన్న కప్పు తీసుకోవడం సురక్షితం. ఉడికించడం ఉత్తమం: నూనెలో వేయించడం కంటే ఉడికించిన లేదా కాల్చిన మొక్కజొన్న ఆరోగ్యకరం. కాంబినేషన్: స్వీట్ కార్న్ తినేటప్పుడు దాంతో పాటు ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారంలేదా పీచు పదార్థం ఉన్న కూరగాయలు తీసుకుంటే షుగర్ కంట్రోల్‌లో ఉంటుంది.

CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక
శనివారం | తెలంగాణ
2 మే 2026
cknews@gmail.com

Follow:
@cknews



సొగసైన తెల్లటి స్ట్రాప్‌లెస్ పోర్ట్రెయిట్‌లో ప్రతిభా రాంత స్టన్‌లు

# పింక్ డ్రెస్ లో సెగలు పుట్టిస్తున్న కన్నడ కస్తూరి రుక్మిణి వసంత్



తెలుగు ప్రేక్షకుల మనసు గెలుచుకున్న కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్, ప్రస్తుతం టాలీవుడ్ మరియు శాండల్ వుడ్ లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా మారిపోయింది. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే ఈ అమ్మడు, తాజాగా పోస్ట్ చేసిన పింక్ డ్రెస్ ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. పద్ధతైన లుక్‌లో మాత్రమే కాదు, మోడ్రన్ డ్రెస్సుల్లో కూడా తాను అదరగొట్టగలనని రుక్మిణి నిరూపిస్తోంది.

**డ్రీమింగ్ ఇన్ పింక్.. అదిరిపోయిన ఫోటో షూట్:**

రుక్మిణి వసంత్ తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో "డ్రీమింగ్ ఇన్ పింక్ టు నైట్ " అంటూ కొన్ని ఫోటోలను షేర్ చేసింది. ఇందులో ఆమె ధరించిన పింక్ కలర్ డ్రెస్ చాలా స్టైలిష్‌గా మరియు మోడ్రన్‌గా ఉంది. సాధారణంగా సినిమాల్లో చాలా సింపుల్‌గా కనిపించే రుక్మిణి, ఇలాంటి గ్లామరస్ అవుట్ ఫిట్‌లో కనిపించడంతో ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ఆమె కళ్ళలోని మెరుపు, ఆ డ్రెస్ లోని హొయలు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి.

**ఆ డ్రెస్ స్పెషాలిటీ ఏంటో తెలుసా?:**

రుక్మిణి ధరించిన ఈ బేబీ పింక్ కలర్ డ్రెస్ ఒక లగ్జరీ లేబుల్ కి చెందినది. 'ఐవఎవ ఎఎ +ఖఎతీఅవశ్రీశ్రీఖ' అనే బ్రాండ్‌కు చెందిన '×ంశ్రీఖ ఐతీవంం' లో ఆమె మెరిసిపోతోంది. ఇది మలాయ్ మరియు నెట్ ఫ్యాబ్రిక్స్‌తో తయారైన ఫ్లోర్ లెంగ్త్ గౌన్. అసమానమైన నెక్ లైన్, పొడవైన చేతులు మరియు ఒంటికి హత్తుకుపోయే బాడీకాన్ స్టైల్ లో ఉన్న ఈ డ్రెస్ లో రుక్మిణి తన అందాలను ఎంతో హుందాగా ఆరబోసింది.

**'సప్త సాగరాలు దాటి' తెచ్చిన క్రేజ్:**

కన్నడ చిత్రం 'సప్త సాగరదాచే ఎల్లో' తెలుగులో 'సప్త సాగరాలు దాటి' పేరుతో విడుదలై క్లాసిక్ హిట్ గా నిలిచింది. ఇందులో ప్రియా పాత్రలో రుక్మిణి నటనకు తెలుగు ఆడియన్స్ ఫిదా అయ్యారు. ఆ సినిమా తర్వాత ఆమెకు టాలీవుడ్‌లో వరుస అవకాశాలు వస్తున్నాయి. తరువాత నిఖిల్ సిద్ధార్థ సరసన 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' సినిమాతో నేరుగా టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి మంచి గుర్తింపు తెచ్చుకుంది.


**పాన్ ఇండియా సినిమాలతో బిజీ:**

రుక్మిణి వసంత్ ఇప్పుడు చిన్న సినిమాలే కాదు, ఏకంగా పాన్ ఇండియా సినిమాలతో బిజీగా ఉంది. రిషబ్ శెట్టి ప్రతిష్టాత్మక చిత్రం 'కాంతార: చాప్టర్ 1' లో ఆమె 'కనకవతి'గా హిట్ అందుకుంది. ఇక రాకింగ్ స్టార్ యశ్ నటిస్తున్న 'టాక్సిక్' సినిమాలో ఆమె ఒక కీలక పాత్ర పోషిస్తోంది. అలాగే ఇక ఈ సినిమాతో ఆమె రేంజ్ ఒక్కసారిగా పెరిగిపోవడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.



వైట్ ట్యాంక్ టాప్ మరియు డెనిమ్ కోస్టల్ ఫోటోషూట్‌లో రాశి సింగ్ స్టన్స్

# ప్రభాస్ మేకర్స్.. అస్సలు తగ్గే ఆలోచనలోనే లేరా?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుసగా భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన లైనప్ లో ఉన్న సినిమాలన్నీ హై బడ్జెట్ పాన్ ఇండియా చిత్రాలే కావడం విశేషం. ఒకవైపు షూటింగ్స్, మరోవైపు రిలీజ్ ప్లాన్లతో మేకర్స్ ఎక్కడా తగ్గకుండా ముందుకు సాగుతున్నట్లు ఇప్పుడు టాక్ వినిపిస్తోంది. నిజానికి.. ఇప్పుడు ప్రభాస్ చేతిలో ఫౌజీ, స్పిరిట్, కల్కి 2, సలార్ 2 వంటి క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం ఫౌజీ, స్పిరిట్ సినిమాల షూటింగ్స్ శరవేగంగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఆ రెండు చిత్రాల మేకర్స్ అనుకున్న షెడ్యూల్ కు కట్టుబడి పని చేస్తున్నారనే టాక్ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ప్రకటించిన తేదీలకు సినిమాలు ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారట. దీంతో ప్రభాస్ అభిమానుల్లో ఆనందం నెలకొంది. ముందుగా ఫౌజీ విషయానికి వస్తే.. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఆ చిత్రంపై మంచి అంచనాలు ఉన్నాయి. పీరియాడిక్ టచ్ తో రూపొందుతున్న ఆ సినిమాలో ప్రభాస్ వింటేజ్ లుక్ లో కనిపించనున్నారని సమాచారం. ఇప్పటికే ఆ సినిమా షూటింగ్ సుమారు 80 శాతం పూర్తయిందని తెలుస్తోంది. ఇంకా మూడు భారీ యాక్షన్ ఎపిసోడ్లు మాత్రమే చిత్రీకరించాల్సి ఉందట. అవి పూర్తయితే మొత్తం షూటింగ్ కంప్లీట్ అవుతుందని వినికిడి. ఆ చిత్రంలో యాక్షన్‌తో పాటు ఎమోషనల్ సీన్స్ కూడా ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని యూనిట్ భావిస్తోంది. మిగిలిన భాగాన్ని వేగంగా పూర్తి చేసి 2026 చివర్లో సినిమాను విడుదల చేయాలని మేకర్స్ టార్గెట్ పెట్టుకున్నారు. దసరా సీజన్ ను కూడా టార్గెట్ చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇక స్పిరిట్ విషయానికి వస్తే.. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా రూపొందిస్తున్న ఆ చిత్రం కూడా భారీ అంచనాలు సొంతం చేసుకుంది. అర్జున్ రెడ్డి, యానిమల్ వంటి సినిమాలతో సంచలనం సృష్టించిన సందీప్, ఈసారి ప్రభాస్ ను పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా చూపించబోతున్నాడు. దీంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. అయితే ప్రభాస్ డేట్స్ విషయంలో కొంత ఇబ్బంది ఉందనే ప్రచారం గతంలో వినిపించింది. అయినప్పటికీ దర్శకుడు వంగా పక్కా ప్లానింగ్ షూటింగ్ ను ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ నాటికి షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారట. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులపై దృష్టి సారించి, ప్రకటించిన తేదీ అయిన 2027 మార్చి 5న సినిమాను విడుదల చేయాలని నిర్ణయంతో ఉన్నారని సమాచారం. గత కొంతకాలంగా ప్రభాస్ సినిమాలు తరచూ వాయిదాలు పడుతున్నాయి. కానీ ఫౌజీ, స్పిరిట్ విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. ముందుగానే స్క్రిప్ట్ పనులు పూర్తి చేసి, క్లియర్ ప్లానింగ్ తో షూటింగ్స్ నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. ఏదేమైనా ఇప్పుడు ప్రభాస్ సినిమాల విషయంలో ఈసారి మేకర్స్ అస్సలు తగ్గేలా కనిపించడం లేదు. ఫిక్స్ చేసుకున్న షెడ్యూల్ లకు కట్టుబడి, సమయానికి సినిమాలను రిలీజ్ చేయాలనే పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. ఇదే కొనసాగితే రాబోయే రోజుల్లో ప్రభాస్ అభిమానులకు వరుస పండుగలు ఖాయం అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరి చూడాలి డార్లింగ్ అప్ కమింగ్ మూవీస్ ఎలాంటి విజయాలు సాధిస్తాయో..